RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి సంపుటి : 2 సంచిక : 55 మంగళవారం, మార్చి 26, 2024 పేజీలు : 4

### ఓవైసీతో తలపడుతున్నదెవరు?

హైదరాబాద్: లోక్ సభ ఎన్నికల్లో హైదరాబాద్ నియోజకవర్గం అందరినీ ఆకర్షిస్తోంది. హైదరాబాద్ లోక్ సభ స్థానానికి మజ్లీస్ పార్టీ నుంచి ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ పోటీచేస్తున్నారు. కాగా ఆయనకు ప్రత్యర్థులుగా బిఆర్ఎస్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ ను బరిలోకి దించింది. కాగా భారతీయ జనతా పార్టీ మాధవీ లతను తమ పార్టీ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దింపింది. అయితే కాంగ్రెస్ పార్టీ మాత్రం హైదరాబాద్ లోక్ సభ స్థానానికి ఇంకా తమ అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది.

### ఆసుపత్రిలో కోలుకుంటున్న...

# సద్గురు



**న్యూఢిల్లీ మార్చి, 25 :** మెదడులో రక్తస్రావం కారణంగా ప్రాణాపాయ స్థితికి చేరుకుని ఎమర్జెన్సీ బ్రెయిన్ సర్జరీ చేయించుకున్న ఆధ్యాత్మిక గురువు సద్గురు జగ్గీ వాసుదేవ్ న్యూఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో ఆసుపత్రిలో కోలుకుం టున్నారు. ఆసుపత్రిలోని తన గదిలో బెడ్ మీద కూర్చుని వార్తా ప్రతిక చదువుతున్న జగ్గీ వాసుదేవ్ వీడియోను ఆయన కుమార్తె సోషల్ మీడియాలో సోమవారం షేర్ చేశారు. న్యూఢిల్లీలో వేగంగా కోలుకుంటున్న సద్గురు అంటూ ఆమె తన తండ్రి ఆరోగ్య పరిస్థితిని ఆయన అభిమానులకు తెలియచేశారు. ఆ వీడియోలో సద్గురు తలపైన బ్యాండేజ్ ప్యాచ్ కనిపించింది. సద్గురు ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన చెందుతున్న ఆయన అభిమానులు, శిష్యులు పోస్టు చేసిన కొద్ది నిమిషాలకే దాదాపు 17 లక్షల మంది ఈ వీడియోను వీక్షించారు. సద్గురు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కామెంట్లు కూడా రాశారు.

# అడవుల్లో వరుస అగ్నిప్రమాదాలు



**హైదరాబాద్ మార్చి, 25 :** వేసవి మొదలైనప్పటి నుంచి అడవుల్లో వరుసగా జరుగుతున్న అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖను ఆ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. ఈ మధ్యకాలంలో అమ్రాబాద్, కవ్వాల్, తాడ్వాయి, ఇల్లందు తదితర ప్రాంతాల్లో అటవీ ప్రమాదాలు జరుగుతున్నట్లు తనకు సమాచారం వచ్చిందని మంత్రి తెలిపారు. ఈ అటవీ ప్రమాదాల వల్ల వన్య ప్రాణులతో పాటు విలువైన అటవీ సంపదకు ఎక్కువగా నష్టం జరిగే అవకాశం ఉన్నందున అటవీ శాఖతో పాటు ప్రజలందరూ అప్రమత్తం గా ఉండాలని మంత్రి సురేఖ సూచిం చారు. అగ్ని ప్రమాదాల వల్ల పర్యావ ణంలో సమతుల్యత లోపించి విపత్తుల బారిన పడుతున్నామని పేర్కొన్నారు. అడవులను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని మంత్రి పేర్కొన్నారు. అటవీ ప్రాంతాల గుండా ప్రయాణం చేసేవారు కూడా అప్రమత్తంగా ఉండాలని.. వేసవిలో అడవుల్లో వంట చేయడం, సిగరెట్, బీడీ, చుట్ట లాంటివి తాగి అక్కడ అడవుల్లో పడేయడం చేయవద్దని మంత్రి కోరారు. ఇలా మానవ నిర్లక్ష్యం వల్లే అటవీ అగ్ని ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నందువల్ల తగు జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అదే సమయంలో అటవీ శాఖ వద్ద ఉన్న అటవీ అగ్ని ప్రమాద నివారణ యంత్రాలపై మంత్రి అధికారులతో ఆరా తీశారు.



### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుపై...

# సిఎం రేవంత్ రెడ్డికి ఫిర్యాదు

హైదరాబాద్: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుపై హైదరాబాద్ వ్యాపార వేత్త శరణ్ చౌదరి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నపుడు తనను అక్రమంగా నిర్బంధించి ఎర్రబెల్లి దయాకర్ రావు బంధువు పేర తన ఇల్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని.. దాంతోపాటు రూ.50 లక్షల నగదును తీసుకున్నారంటూ సిఎం రేవంత్ రెడ్డికి ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశారు. 2023, ఆగస్టు 21వ తేదీన తాను ఆఫీస్‌కు వెళ్తుండగా కొందరు సివిల్ దుస్తుల్లో వచ్చి తనను అడ్డుకుని తాము పోలీసులమని చెప్పి సిసిఎస్‌కు తీసుకెళ్లారని, అక్కడకు వెళ్లిన తర్వాత పలువురి నుంచి అక్రమంగా డిపాజిట్‌లు సేకరించినట్లు తనపై కేసు పెట్టినట్లు ఏసిపి ఉమామహేశ్వర్ రావు బెదిరించారని, అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, డిసిపి రాధా కిషన్ రావు సూచనల మేరకు తనను పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించి కొట్టారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

# 'భారత్ మాతా కీ జై' నినాదం ఒక ముస్లింది



**మలప్పురం (కేరళ) మార్చి, 25 :** 'భారత్ మాతా కీ జై', 'జై హింద్' నినాదాలను ముందుగా చేసింది ఇద్దరు ముస్లింలు అని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సోమవారం వెల్లడించారు. వాటిని సంఘ్ పరివార్ విడనాడుతు ందా అని విజయన్ ప్రశ్నించారు. ముస్లింల ఆధిపత్యం ఉన్న ఈ ఉత్తర కేరళ జిల్లాలో మైనారిటీ వర్గానికి వెటరన్ సిపిఐ (ఎం) నేత విజయన్ మద్దతు ప్రకటిస్తూ, ముస్లిం పాలకులు, సాంస్కృతిక ప్రముఖులు, అధికారులు దేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమంలో గణనీయమైన పాత్ర పోషించారని తెలియజేశారు. విజయన్ తన వాదనకు మద్దతుగా చరిత్ర నుంచి ఉదాహరణలు ఉ టంకిస్తూ, అజీముల్లా ఖాన్ అనే ముస్లిం 'భారత్ మాతా కీ జై' నినాదాన్ని తొలిసారి వాడారని తెలిపారు. 'ఇక్కడికి వచ్చిన సంఘ్ పరివార్ నేతలు కొందరు తమ ముందు కూర్చున్నవారిని 'భారత్ మాతా కీ జై' అని నినదించవలసిందని అడిగారు. ఆ నినాదాన్ని ఎవరు సృష్టించారు ? సదరు వ్యక్తి పేరు అజీముల్లా ఖాన్ అని సంఘ్ పరివార్‌కు తెలుసో లేదో నాకు తెలియదు' అని సిఎం చెప్పారు. ఆ నినాదం సృష్టికర్త ఒక ముస్లిం అయినందున వారు దానిని వాడడం మానివేస్తారో లేదో తనకు తెలియదని విజయన్ చెప్పారు. వివాదాస్పద పౌరసత్వ (సవరణ) చట్టం (సిఎఎ)కు వ్యతిరేకంగా కేరళలో సిపిఐ (ఎం) వరుసగా నిర్వహించిన నాలుగవ ర్యాలీలో విజయన్ మాట్లాడారు. అబీద్ హసన్ అనే పాత దౌత్యవేత్త'జై హింద్' నినాదాన్ని మొదట చేశారని ఆయన తెలిపారు. మొఘల్ చక్రవర్తి షాజహాన్ కుమారుడు దారా షికోహ్ సంస్కృతంలో నుంచి పర్షియన్‌లోకి 50కి పైగా ఉపనిషత్తులను తర్జుమా చేయడం వల్ల భారతీయ గ్రంథాలు ప్రపంచం అంతటికీ అందాయని విజయన్ తెలియజేశారు. భారత్ నుంచి పాకిస్తాన్‌కు ముస్లింల తరలింపును ప్రవచిస్తున్న సంఘ్ పరివార్ నేతలు, కార్యకర్తలు ఈ చారిత్రక నేపథ్యాన్ని అవగాహన చేసుకోవలసిన అవసరం ఉందని విజయన్ అన్నారు. ముస్లింలు కూడా దేశ స్వాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించారని ఆయన గుర్తు చేశారు.

# రాహుల్‌కు 'అమేథిలో పట్టిన గతే'



**వాయనాడ్ మార్చి, 25 :** 2019లో నాలుగు లక్షల పైచిలుకు వోట్ల ఆధిక్యంతో రాహుల్ గాంధీ విజయం సాధించిన నియోజకవర్గంలో ఈ దఫా ఆయన ప్రత్యర్థి, బిజెపికి చెందిన కె సురేంద్రన్ భారీ ప్రకటన చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్‌కు 'అమేథి ఫలితమే ఎదురవుతుంది' అని సురేంద్రన్ సోమవారం ధీమా వ్యక్తం చేశారు. కేరళలోని వాయనాడ్‌లో తమ అభ్యర్థిగా సురేంద్రన్ పేరును బిజెపి ఆదివారం ప్రకటించిన విషయం విదితమే. కేరళలో రానున్న లోక్‌సభ ఎన్నికలు వాయనాడ్‌కు సంబంధించి ఆసక్తికరంగా మలుపు తిరిగింది. రాహుల్ గాంధీ తన సీటును నిలబెట్టుకునేందుకు పోటీ చేస్తుండగా, వాయనాడ్‌లో సీనియర్ సీపిఐ నాయకురాలు అన్నీరాజాను లెఫ్ట్ ఫ్రంట్ నిలబెట్టింది. 'ఇండియా' కూటమికి చెందిన ఇద్దరు సీనియర్ నేతలు రాహుల్‌ను, అన్నీ రాజాను ఢీకొనేందుకు సురేంద్రన్ అభ్యర్థిత్వాన్ని బిజెపి కేంద్ర నాయకత్వం ప్రకటించింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో వాయనాడ్‌లో ఎన్‌డిఎ అభ్యర్థికి కేవలం 7.25 శాతం వోట్లు వచ్చాయి. తన అభ్యర్థిత్వంపై ప్రకటన వెలువడిన తరువాత సురేంద్రన్ మీడియాతో మాట్లాడుతూ, రాహుల్ గాంధీకి క్రితం సారి అమేథిలో పట్టిన గతే ఇప్పుడు వాయనాడ్‌లో పడుతుందని అన్నారు. 'అభివృద్ధి సంక్షోభం ఉన్న నియోజకవర్గం వాయనాడ్. రాహుల్ గాంధీ నియోజకవర్గానికి ఏమీ చేయలేదు. ఆయనకు అమేథీ ఫలితమే వాయనాడ్‌లో ఎదురవుతుంది' అని సురేంద్రన్ చెప్పారు.

### ఆప్ సోషల్ మీడియా...

# డిపి ప్రచారం ప్రారంభం




**న్యూఢిల్లీ మార్చి, 25 :** దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు తమను బలపరచాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) సోమవారం సోషల్ మీడియా ప్రచారాన్ని ప్రారంభించింది. ఆమ్ సీనియర్ నాయకురాలు, ఢిల్లీ మంత్రి అతిషి సోమవారం సోషల్ మీడియా ప్రచారాన్ని ప్రారంభిస్తూ ప్రజలు ఇందులో చేరాలని విజ్ఞప్తి చేశారు. ఆప్ నాయకులు, కార్యకర్తలు తమ ఎక్స్, ఫేస్‌బుక్, వాట్సాప్, తదితర సోషల్ మీడియా అకౌంట్లలో తమ డిస్‌ప్లే పిక్చర్(డిపి)లను మారుస్తారని, తమ ఫోటోలకు బదులుగా జైలు గోడలలో బందీగా ఉన్న ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఫోటోను పెట్టి మోడీ కా సబ్సే బడా డర్ కేజ్రీవాల్(మోడీకి కేజ్రీవాల్ అంటే భయం) అన్న క్యాప్షన్ రాస్తారని ఆమె తెలిపారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోడీని సవాలు చేయగల సత్తా ఉన్న ఏకైక నాయకుడు కేజ్రీవాల్ అని ఆమె అన్నారు. అందుకే ఎటువంటి ఆధారాలు లేనప్పటికీ లోక్‌సభ ఎన్నికల ప్రకటన తర్వాత కేజ్రీవాల్‌ను





## మనువడితో సిఎం హెూలీ వేడుకలు

**హైదరాబాద్ మార్చి, 25 :** హెూలీ వేడుకలను క్రీడాకారులు, రాజకీయ నాయకులు, సినీ పరిశ్రమకు చెందిన వారు ఘనంగా జరుపుకున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి సైతం హెూలీ వేడుకలను తన మనువడితో కలిసి చేసుకున్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో సోమవారం కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా ఈ వేడుకలను సిఎం జరుపుకున్నారు. మనువడు రియాన్ష్‌తో కలిసి సిఎం రేవంత్‌రెడ్డి సంతోషంగా ఈ సంబురాలు జరుపుకున్నారు. మనువడికి రంగు పూస్తూ ఎంతో ఆనందంగా సెలబ్రేషన్స్ చేసుకున్నారు. మనువడితో కలిసి రేవంత్ రెడ్డి సరదాగా హెూలీ వేడుకల్లో పాల్గొన్న ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# హైదరాబాద్ పార్లమెంట్ పై ప్రధాన పార్టీల ఫోకస్...

**హైదరాబాద్ మార్చి, 25:** పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో తెలంగాణలోని అన్ని ప్రధాన పార్టీలు గెలుపు వ్యూహాలపై తీవ్ర కసరత్తులు చేస్తున్నాయి. ఇప్పటికే ఆయా స్థానాలకు అభ్యర్థులను ఫిక్స్ చేస్తూ ఎన్నికల శంఖరావం పూరించాయి. అయితే ఈ నేపథ్యంలో తెలంగాణ పార్లమెంట్ ఎన్నికలు అనగానే మొదటగా గుర్తుకు వచ్చేది హైదరాబాద్ లోక్ సభ స్థానమే. అయితే ఆ సీటు పై ఇప్పటికే ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను రంగంలోకి దింపాయి. ఈ లోక్ సభ ఎన్నికల్లో ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీపై భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్), భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థులను ప్రకటించాయి. హైదరాబాద్ లోక్ సభ స్థానానికి జరిగే లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తన అభ్యర్థిగా గడ్డం శ్రీనివాస్ యాదవ్ ను ప్రకటించగా, హైదరాబాద్ పార్లమెంట్ స్థానానికి ఎంపీ అభ్యర్థిగా మాధవీలతను బీజేపీ ప్రకటించింది. కాగా కాంగ్రెస్ అభ్యర్థిని ఇంకా ప్రకటించలేదు. అయితే 2019 ఎన్నికల్లో హైదరాబాద్ నియోజకవర్గం నుంచి అసదుద్దీన్ ఒవైసీపై 14 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో ఓవైసీ 58.94 శాతం ఓట్లు సాధించి విజయం సాధించారు. హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో 44.84 శాతం ఓటింగ్ తో ఒవైసీకి 26.43 శాతం ఓట్లు లభించాయి. 1989 నుంచి ఎంఐఎం వరుసగా తొమ్మిది సార్లు హైదరాబాద్ లోక్ సభ ఎన్నికల్లో విజయం సాధించింది. సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ 1984–89 మధ్య స్వతంత్ర అభ్యర్థిగా ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. 1989 నుంచి 2004 వరకు సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ ఎంఐఎం ఎంపీగా ప్రాతినిధ్యం వహించారు.

### అసద్ రాజకీయ ప్రత్యర్థులు వీళ్లే



## సంపాదకీయం

# అన్ని వేళ్లు కేజ్రీ వైపే...

ఢిల్లీ మద్యం పాలసీ కేసు దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో ఇప్పటివరకు పలువురిని అరెస్ట్ చేసిన ఈడీ అధికారులు.. తాజాగా ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నేషనల్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయడం ఈ కేసులోనే కీలక మలుపుగా మారింది. కొద్దిరోజుల పాటు ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు కోల్డ్ స్టోరేజ్ లోకి వెళ్ళింది. ఇంకేముంది రాజకీయ పైరవీలతో కేసును నీరు గార్చారని.. నిందితులు మొత్తం సేఫ్ అనే వ్యాఖ్యలు వినిపించాయి. ఈ కేసులో కీలక ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో కొంతమంది బెయిల్ మీద బయటకు వచ్చారు. అప్పట్లో శరత్ చంద్రారెడ్డి, మాగుంట రాఘవ, అభిషేక్, బుచ్చిబాబు వంటి వారంతా అప్రూవర్లుగా మారారని ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు ప్రకటించారు. వారు చెప్పిన వివరాల ఆధారంగా కవితను పద మార్లు విచారించారు. తర్వాత ఆమె సుప్రీంకోర్టుకు వెళ్లారు. నళిని చిదంబరం కేసును ప్రస్తావిస్తూ సుప్రీంకోర్టు తలుపు తట్టారు. సుప్రీంకోర్టు కూడా కవితకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో.. ఈడీ సైలెంట్ అయిపోయింది. ఆలోగానే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు రావడం.. ఆ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి ఓడిపోవడంతో ఈడీ రెట్టించిన ఉత్సాహంతో మళ్లీ కేసును తవ్వడం మొదలుపెట్టింది. చడిచప్పుడు లేకుండా హైదరాబాద్ వచ్చింది. కవిత ఇంట్లోకి సైలెంట్ గా వెళ్లిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరించడంతో.. కవితను అరెస్టు చేసి తీసుకెళ్లింది. ఈ ఢిల్లీ లిక్కర్ కేసు విచారణకు రావాలని ఈడీ అధికారులు 9 సార్లు సమన్లు జారీ చేసినా.. ఆయన హాజరు కాలేదు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్ట్ చేసింది. గురువారం సాయంత్రం కేజ్రీవాల్ నివాసానికి చేరుకున్న ఈడీ బృందం.. ఆయన్ను అదుపులోకి తీసుకున్నట్లు ప్రకటించింది. పదవిలో ఉండగా అరెస్టయిన తొలి ముఖ్యమంత్రిగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ రికార్డుల్లోకి ఎక్కారు. ఆయన అరెస్ట్‌తో ఆప్ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. అయితే, అరెస్టయినా ఆయనే ప్రభుత్వాన్ని నడుపుతారని ఆప్ ప్రకటించింది. ఈడీ అరెస్ట్ నుంచి రక్షణ కల్పించలేమని ఢిల్లీ హైకోర్టు నిరాకరించిన కొద్ది గంటలకే కేజ్రీవాల్‌ను ఈడీ అదుపులోకి తీసుకుంది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో తొమ్మిదిసార్లు ఈడీ సమన్లు జారీచేసినా... ఆయన హాజరుకాలేదు. మనీల్యాండరింగ్ కేసులో ఇటీవల ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. అయితే, తన రాజీనామాను గవర్నర్ ఆమోదించే వరకూ అరెస్ట్ మెమోపై ఆయన సంతకం చేయలేదు. అరెస్ట్‌కు ముందు ఆయన రాజీనామా చేసి.. తన వారసుడిగా చంపై సోరెన్‌కు పగ్గాలు అప్పగించారు. ఈ క్రమంలోనే కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేస్తారని.. గత కొన్ని రోజుల నుంచి ఆప్ మంత్రులు అతిషి, సౌరభ్ భరద్వాజ్ సహా పలువురు నేతలు కూడా పేర్కొంటున్నారు. అన్నట్టుగానే గురువారం రాత్రి కేజ్రీవాల్ నివాసంలో సోదాలు నిర్వహించిన ఈడీ అధికారుల బృందం రెండున్నర గంటల తర్వాత ఆయనను అరెస్ట్ చేస్తున్నట్లు కేజ్రీవాల్ భార్యకు సమాచారం అందించారు. అరెస్ట్ తర్వాత ఈ ఢిల్లీ మద్యం కేసు గురించి ఈడీ అధికారులు సంచలన విషయాలు వెల్లడించారు. ఢిల్లీ మద్యం పాలసీ విధానం 2022 రూపకల్పన చేసే సమయంలో కొందరు వ్యక్తులకు లాభం చేకూర్చేలా ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, అప్పటి డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కలిసి కుట్ర చేశారని ఈడీ ఆరోపిస్తోంది. ఈ క్రమంలోనే ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్‌ను కుట్రదారుగా ఈడీ అభివర్ణించింది. ఈ కేసులో సౌత్ గ్రూప్‌కు లబ్ధి చేకూర్చేలా ఢిల్లీ మద్యం పాలసీ విధానం 2022 ను రూపొందించారని ఈడీ ప్రధాన ఆరోపణ చేస్తోంది. మద్యం పాలసీ విధానంలో మార్పులు చేర్పులు చేసిన దానికి ప్రతిఫలంగా సౌత్ గ్రూప్ ఆమ్ ఆద్మీ పార్టీకి రూ. 100 కోట్ల ముడుపులు ఇచ్చిందని పేర్కొంది. వాటిని 2022 గోవా అసెంబ్లీ ఎన్నికలకు ఆప్ వినియోగించుకుందని పేర్కొంది. ఈ మొత్తం వ్యవహారాన్ని ఈడీ అధికారులు సౌత్ లాబీగా పేర్కొంటున్నారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్ట్ చేసిన కొందరు నిందితులు.. మరికొందరు సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాల్లో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పేరు ఉందని.. ఈడీ అధికారులు అరెస్ట్ చేసిన సందర్భంగా నోట్‌లో చేర్చారు. ఇక ఈ ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో నిందితుల్లో ఒకరైన విజయ్ నాయర్ తరచూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కార్యాలయానికి వెళ్లేవారని.. ఎక్కువ సమయం అక్కడే గడిపేవారని ఈడీ వెల్లడించింది. లిక్కర్ పాలసీ గురించి సీఎం కేజ్రీవాల్‌తో చర్చించినట్లు మద్యం వ్యాపారులకు విజయ్ నాయర్ చెప్పినట్లు ఈడీ ఆరోపణలు చేసింది. ఇందులో భాగంగానే ఇండో స్పిరిట్ యజమాని సమీర్ మహేంద్రు.. సీఎం కేజ్రీవాల్‌ను కలిసేందుకు విజయ్ నాయర్‌ని పంపినట్లు తెలిసింది.

# జోరుగా హుషారుగా హోలీ సంబరాలు







**శామీర్ పేట, (గరుడ వార్త) :** ఉమ్మడి శామీర్ పేట మండలం లో జోరుగా హుషారుగా హోలీ సంబరాలను జరుపుకున్నారు. సోమవారం శామీర్ పేట మండలం, మూడు చింతలపల్లి మండలం, తూముకుంట మున్సిపల్ పరిధిలో చిన్న పెద్ద తేడా లేకుండా హోలీ వేడుకలను నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆయా గ్రామాల్లోని చిన్నారులు పెద్దలు ఎంతో హుషారుగా హోలీ జరుపుకున్నారు. యువకులు వివిధ రకాల రంగులను చల్లుకొని హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. చిన్నారులు కేరింతలు కొడుతూ హోలీ పండుగ ను జరుపుకున్నారు. వివిధ పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు హోలీ వేడుకలలో పాల్గొన్నారు.

# గాలి జనార్ధన్ రెడ్డి పార్టీ బిజెపిలో విలీనం

బెంగళూరు: గనుల దిగ్గజం, కర్నాటక రాజ్య ప్రగతి పక్ష(కెఆర్‌పిపి) ఏకైక ఎమ్మెల్యే గాలి జనార్దన రెడ్డి సోమవారం తన పార్టీని బిజెపిలో విలీనం చేశారు. కర్నాటక మాజీ ముఖ్యమంత్రి బిఎస్ యడియూరప్ప, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బివై విజయేంద్ర సమక్షంలో గాలి జానార్దన రెడ్డి కాషాయ కండువా కప్పుకున్నారు. ఆయనతోపాటు ఆయన భార్య అరుణ లక్ష్మి కూడా బిజెపిలో చేరారు. బిజెపిలో తన పార్టీని విలీనం చేసి తాను ఆ పార్టీలో చేరడం సంతోషం ఉందని జనార్ధన రెడ్డి తెలిపారు. ఎటువంటి షరతులు లేకుండా తాను బిజెపిలో చేరానని, తనకు ఎటువంటి పదవులు అవసరం లేదని ఆయన తెలిపారు. జనార్ధన రెడ్డి చేరికపై యడియూరప్ప సంతోషం వ్యక్తం చేశారు. ఇది చాలా మంచి నిర్ణయమని, తమ పార్టీని మరింత బలోపేతం చేస్తుందని యడియూరప్ప అన్నారు. రాష్ట్రంలోని మొత్తం 28 లోక్‌సభ స్థానాలను బిజెపి గెలుచుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జనార్ధన రెడ్డి, ఆయన భార్య, మిత్రులు బిజెపిలో చేరడం తమ పార్టీ బలం పెంచుతుందని ఆయన తెలిపారు. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు గాలి జనార్ధన రెడ్డి కెఆర్‌పిపిని స్థాపించి ఎన్నికల్లో పోటీ చేశారు. ఆయన గంగావతి అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందారు. ఆయన సోదరులు జి కరుణాకర రెడ్డి, సోమశేఖర రెడ్డి బిజెపి అభ్యర్థులుగా పోటీ చేసి ఓటమి పాలవ్వడం గమనార్హం. అక్రమ



మైనింగ్ కేసులో అరెస్టయి, జైలు పాలవ్వడానికి ముందు ఆయన కర్నాటకలో యడియూరప్ప ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. కర్నాటకలోని 28 లోక్‌సభ స్థానాలకు రెండు విడతలుగా ఏప్రిల్ 26, మే 7న పోలింగ్ జరగనున్నది. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనున్నది.

# జెఎన్‌యుఎస్‌యుకు తొలి వామపక్ష దళిత అధ్యక్షుడు

న్యూఢిల్లీ: మూడు దశాబ్దాల తర్వాత వామపక్ష గ్రూపులకు చెందిన తొలి దళిత విద్యార్థిని జవహర్‌లాల్ నెహ్రూఊ యూనివర్సిటీ విద్యార్థుల సంఘం(జెఎన్‌యుఎస్‌యు) ఎన్నుకుంది. ఆదివారం జరిగిన జెఎన్‌యుఎస్‌యు ఎన్నికలలో ఐక్య వాపక్ష ప్యానల్ క్లీన్ స్వీప్ చేసింది. ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ ఎబివిపి ప్యానల్ ఘోర పరాజయాన్ని చవిచూసింది. నాలుగేళ్ల విరామం అనంతరం జరిగిన జెఎన్‌యుఎస్‌యు ఎన్నికలలోఅధ్యక్షుడిగా అఖిల భారత విద్యార్థుల సంఘం(ఎఐఎస్‌ఎ)కు చెందిన ధనంజయ్ గెలుపొందారు.

ధనంజయ్‌కు 2,598 ఓట్లు రాగా ఆయన సమీప ప్రత్యర్థి ఎబివిపికి చెందిన ఉయేష్ సి అజ్మీరాకు 1,676 ఓట్లు లభించాయి. బీహార్‌లోని గయకు చెందిన ధనంజయ్ దళిత వర్గానికి చెందిన విద్యార్థి. 199697 తర్వాత వామపక్షాల నుంచి ఒక దళిత విద్యార్థి జెఎన్‌యుఎస్‌యు అధ్యక్ష పదవికి ఎన్నిక కావడం ఇదే మొదటిసారి. ఫలితాల వెల్లడి అనంతరం ధనంజయ్ విలేకరులతో మాట్లాడుతూ విద్వేష, హింసాత్మక రాజకీయాలను జెఎన్‌యు విద్యార్థులు తిరస్కరిస్తున్నారనడానికి ఇదే ఈ విజయమే నిదర్శనమని అన్నారు. విద్యార్థులు తమ పట్ల మరోసారి తమ నమ్మకాన్ని చూపారని, విద్యార్థుల హక్కులు, వారి సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని ధనంజయ్ తెలిపారు.

క్యాంప్‌లోని విద్యార్థినుల భద్రత, నిధుల కోత, స్కాలర్‌షిప్ పెంపు, మౌలిక సౌకర్యాలు, మంచినీటి కొరత వంటివి తమ ప్రథమ పాధాన్యతలని ఆయన తెలిపారు. లాల్ సలామ్, జై భీమ్ వంటి నినాదాల మధ్య ఎరుపు, తెలుపు, నీలం జెండాలను ప్రదర్శిస్తూ విద్యార్థులు విజయోత్సవాలు జరుపుకున్నారు. ఉపాధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలో ఎస్‌ఎఫ్‌ఐకి చెందిన అవిజిత్ ఘోష్ ఎబివిపి అభ్యర్థి దీపికా శర్మను 927 ఓట్ల తేడాతో ఓడించారు. ప్రధాన కార్యదర్శిగా లెఫ్ట్ మద్దతుగల బిర్సా అంబేద్కర్ పూలే విద్యార్థుల సంఘం(బిఎపిఎస్‌ఎ) అభ్యర్థి ప్రియాంషి ఆర్య ఎబివిపి అభ్యర్థి అర్జున్ ఆనంద్‌ను 926 ఓట్ల తేడాతో ఓడించారు.

# సార్...గిరాకీల్లేవ్...

## అప్పులు కట్టలేకపోతున్నాం...

## ఇల్లు గడిచే పరిస్థితి లేదు

- **ముమ్మల్ని ఆదుకోండి...**
- **బండి సంజయ్‌కు ఆటో డ్రైవర్ల మొర**
- **ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని బండి హామీ**

"సార్... గత మూడు నెలలుగా గిరాకీల్లేవు. ఫైనాన్స్ తెచ్చి ఆటోనడుపుతున్నం. అప్పులకు వడ్డీలు కూడా కట్టేలేకపోతున్నం. అంతంత మాత్రమే గిరాకీలు వస్తున్నయ్. బడి పిల్లలను తీసుకెళుతుండటంతో వాళ్లిచ్చే డబ్బులతో ఇల్లు గడుస్తోంది. ఎండాకాలం సెలవులు రాబోతున్నయ్. బడి పిల్లల గిరాకీ కూడా ఉండదు. అసలు అప్పులు బాధ దేవుడెరుగు.. ఎట్లా బతకాలో కూడా అర్థం కావడం లేదు"కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ ఎదుట ఆటోవాలాలు పెట్టుకున్న మొర ఇది. బండి సంజయ్ కుమార్ ఈరోజు కరీంనగర్ లోని సెయింట్ జాన్స్ స్కూల్ వద్ద ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆటో డ్రైవర్లను కలిశారు. వారితో కలిసి ఛాయ్ తాగుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం కల్పించడంతో తమకు గిరాకీ లేకుండా పోయిందని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఇన్సూరెన్స్ కూడా చెల్లించే పరిస్థితి లేదన్నారు. ఒకవైపు ట్రాఫిక్ పోలీసుల వేధింపులు కూడా ఎక్కువయ్యాయని వాపోయారు. రాబోయే రెండు నెలలపాటు స్కూళ్లు కూడా ఉండవని, తమకు ఇల్లు కూడా కష్టమయ్యే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... "మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం మంచిదే. అదే సమయంలో మిమ్ముల్ని (ఆటో డ్రైవర్లను ఉద్దేశించి) కూడా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

ఉపాధికి ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది."అని అభిప్రాయపడ్డారు. బాధపడాల్సిన అవసరం లేదని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆటో డ్రైవర్లు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

# అరుణాచల్ ప్రదేశ్‌పై ఆగని చైనా ప్రేలాపనలు

బీజింగ్: అరుణాచల్ ప్రదేశ్ తమ దేశంలో అంతర్భాగమంటూ చైనా పునరుద్ఘాటించింది. ఈ వాదనను అసంబద్ధం, హాస్యాస్పదమంటూ భారత్ ఖండించినప్పటికీ చైనా మాత్రం మరోసారి ఇదే వాదనతో ముందుకు వచ్చింద.ఇ అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని, చైనా వాదన హాస్యాస్పదమని భారత విదేశీ వ్యవహారాల మంత్రి శనివారం చేసిన ప్రకటనకు స్పందనగా చైనా విదేశీ మంత్రిత్వశాఖ ప్రతినిధి లిన్ జియాన్ సోమవారం మళ్లీ పాత పాటే వినిపించారు. భారత్, చైనా మధ్య సరిహద్దు సమస్య పరిష్కారం కాలేదని జిన్ తెలిపారు. భారత్ అక్రమంగా ఆక్రమించుకోవడానికి ముందు యాంగ్‌నాన్(అరుణచల్ ప్రదేశ్‌కు చైనా అధికారిక పేరు) చైనాలో మొదటినుంచి అంతర్భాగమేనని ఆయన స్పష్టం చేశారు. ఆ ప్రాంతంలో చైనా పాలన సమర్థంగా కొనసాగిందని ఆయన చెప్పారు. అక్రమంగా ఆక్రమించుకున్న ప్రాంతానికి 1987లో భారత్ అరుణాచల్ ప్రదేశ్ అని ఏరు పెట్టుకోవడం ఎవరూ కాదనలేని సత్యమని ఆయన తెలిపారు. భారత్ చర్యలపై తాము కఠినమైన ప్రకటనలు ఇచ్చామని, ఈ విషయంలో చైనా వైఖరిలో ఎటువంటి మార్పులేదని ఆయన చెప్పారు. అరుణాచల్ ప్రదేశ్ తమదేనంటూ చైనా ప్రకటన చేయడం ఈ నెలలో ఇది నాలుగవసారి. మార్చి 9న భారత ప్రధాని నరేంద్ర మోడీ అరుణాచల్ ప్రదేశ్ సందర్శనకు తాము దౌత్యపరమైన నిరసన భారత్‌కు తెలియచేశామని చైనా ప్రభుత్వం తెలిపింది. అరుణాచల్ ప్రదేశ్‌ను దక్షిణ టిబెట్‌గా వ్యవహరించే చైనా భారత నాయకులు ఆ రాష్ట్రాన్ని సందర్శించిన ప్రతి సందర్భంలోను ఆ ప్రాంతం తమదేనంటూ ప్రకటించడం పరిపాటిగా మారింది. అరుణాచల్ ప్రదేశ్ తమ దేశంలో అంతర్భాగమని చైనా రక్షణ మంత్రి గత వారం చేసిన వాదనను భారత విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ తోసిపుచ్చారు.

# మోడీ... భయాలు!

స్వతంత్ర భారత దేశ చరిత్రలో మొదటి సారిగా అధికారంలో ఉన్న ఓ ముఖ్యమంత్రిని అవినీతి ఆరోపణలతో ఎన్నికల సమయంలో అరెస్ట్ చేయడంలోని ఔచిత్యమును అటుంచితే ఎన్నికల సమయంలో తిరుగులేని విధంగా వ్యవహరిస్తున్న బిజెపిని అంతుబట్టని ఓ భయం వెంటాడుతున్నట్లు వెల్లడి అవుతుంది. గత సంవత్సర కాలంగా జరిపిన పలు ఎన్నికల సర్వేలు బిజెపికి గట్టి పోటీ ఇవ్వగల రాజకీయ పార్టీగాని, కూటమి గాని లేవని స్పష్టం అవుతున్నది. అంతేకాదు, ప్రజాదరణతో ప్రధాని నరేంద్ర మోడీకి పోటీపడ గల నాయకుడు కూడా కనిపించడం లేదు. ఎంతో ఆర్భాటంగా ప్రారంభమైన 'ఇండియా' కూటమి గత డిసెంబర్‌లో ఐదు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం గాలి బుడగ మాదిరిగా పగిలిపోయింది. చివరకు ఈ కూటమి ఏర్పాటులో కీలక సూత్రధారిగా వ్యవహరించిన నితీశ్ కుమార్ స్వయంగా బిజెపితో తిరిగి జతకట్టారు. మరో కీలక నాయకురాలు మమతా బెనర్జీ ఎవ్వరితో పొత్తు లేకుండా ఒంటరిగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు.

దేశ రాజకీయాలను తీవ్రంగా ప్రభావితం చేసే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో గాంధీ కుటుంబం సభ్యులు దశాబ్దాలుగా తమకు కంచుకోటలుగా ఉన్నటువంటి రాయబరేలి, అమేథిల నుండి పోటీ చేసేందుకు వెనకడుగు వేయడం ద్వారా ఒక విధంగా ఈ ఎన్నికల్లో విజయానికి ఆశవదులుకున్నట్లు వెల్లడి అవుతుంది. అయినప్పటికీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయడం, అంతకు నాలుగు రోజుల ముందు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ కుమార్తె కవితను అరెస్ట్ చేయడం గమనిస్తుంటే బిజెపిని తెలియని ఎన్నికల భయం వెంటాడుతున్నట్లు వెల్లడి అవుతుంది. ఎన్‌డిఎ 400కు పైగా సీట్లు గెలుస్తుందని ఎంతో ధీమాగా చెబుతున్నా 2014, 2019 ఎన్నికల నాటి భరోసా ఆ పార్టీ అగ్రనాయకులలో కనిపించడం లేదు. ముఖ్యమంత్రులుగా పని చేసిన వారే సీట్ ఇవ్వకపోయేసరికి అస్త్రసన్యాసం చేస్తుండటం సరికొత్త పరిణామాలను వెల్లడి చేస్తున్నది. గత నెలలో జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ ను అరెస్ట్ చేశారు. పలువురు కాంగ్రెస్ నాయకులను, ఇతర పార్టీలకు చెందిన నాయకులను కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలను చూపి బెదిరించి తమ పార్టీలో చేరేటట్లు వత్తిడి చేస్తున్నారు.


వారిని ఎన్నికలలో అభ్యర్థులుగా కూడా నిలబెడుతున్నారు. ఎప్పుడో బంధం తెంచుకున్న టిడిపి, అకాలీదళ్, బిజెడి వంటి పార్టీలను తిరిగి దగ్గరకు చేర్చుకునేందుకు ఎంతగానో శ్రమిస్తున్నారు. ఒకటి, రెండు నియోజక వర్గాలకు మాత్రమే ప్రభావం చూపే చిన్న చిన్న పార్టీలను సైతం దగ్గరకు తీస్తున్నారు. ఒక్క సీటును కూడా వదులుకునేందుకు సిద్ధంగా లేమనే సంకేతం ఇస్తున్నారు. బహుశా మొదటిసారిగా బిజెపి అభ్యర్థుల జాబితాలో అత్యధికంగా ఇతర పార్టీల నుండి వచ్చిన ఫిరాయింపుదారులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒకప్పుడు మాది 'విలక్షణమైన' పార్టీ అని గర్వంగా చెప్పుకునే బిజెపి నేతలు, ఇప్పుడు తమకు ఏదో విధంగా సీట్లు గెలవడమే ముఖ్యం అనే విధంగా వ్యవహరిస్తున్నారు. ఒకప్పుడు బిజెపితో పొత్తుకోసం పలుప్రాంతీయ పార్టీలు ఆరాటం చెందుతూ ఉండెడివి. కానీ ఇప్పుడు బిజెపి అగ్రనాయకులు ఆ పార్టీల వెంటబడి పొత్తులకు ఆరాటం చెందుతున్నారు.

గత రెండు ఎన్నికలలో పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్షంగా గుర్తింపు పొందేందుకు అవసరమైన సీట్లు కూడా పొందలేని కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రసంగాలలో అసహనం కనిపిస్తున్నది. ఆ పార్టీ ఎక్కడ తలెత్తుకు తిరుగుతుందో అనే భయం వ్యక్తం అవుతుంది. చివరకు నోటాతో పోటీ పడే ఓట్లు మాత్రమే గల ఆంధ్రప్రదేశ్‌లో సైతం అక్కడ అధికారంలో ఉన్న వైసిపి మీదకన్నా కాంగ్రెస్‌పై ఎక్కువగా విమర్శలు గురిపెట్టారు. అంతేకాదు, కాంగ్రెస్‌తో ఎవ్వరు చేతులు కలిపేందుకు సిద్ధమవుతున్న వారి పట్ల కూడా ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్‌కు సైతం ఆయన నాలుగు రాష్ట్రాలలో కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు చేసుకోవడమే కారణాన్ని అందరికీ తెలుసు. కాంగ్రెస్‌తో చేతులు కలపకపోతే తనను దర్యాప్తు ఏజెన్సీలు ఏమీ చేయవని కొందరు బిజెపి నేతలు రాయబారం నడిపారని స్వయంగా కేజ్రీవాల్ చెప్పారు. ఆయన మాటలను బిజెపి నేతలు ఎవరూ ఖండించనే లేదు. ఎందుకంటే, బిజెపికి దాదాపు సగం సీట్లలో ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్. ప్రాంతీయ పార్టీలను దర్యాప్తు ఏజెన్సీలను ప్రయోగించో, మరో విధంగానో దారిలోకి తెచ్చుకోవచ్చు. కానీ కాంగ్రెస్ పుంజుకోవడం అంటే బిజెపికి బలహీనం కావడం అవుతుంది.

అందుకనే కాంగ్రెస్ ఉనికిని తట్టుకోలేకపోతున్నారు. ఆ పార్టీ బ్యాంకు ఖాతాలను ఎన్నికల సమయంలో స్తంభింపచేసి రోజువారీ ఖర్చులకు సైతం ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడేటట్లు చేయగలిగారు. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీపై రాజకీయంగా బిజెపి ఎంతగా పోరాటం చేస్తున్నా, తీవ్రమైన చర్యలకు దిగకపోవడానికి కారణం ఆమె కాంగ్రెస్‌ను దూరంగా ఉంచడమే. కేజ్రీవాల్, మాయావతి, అసదుద్దీన్ ఒవైసి వంటి వారు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాల ఓట్లను చీల్చి బిజెపి అభ్యర్థుల గెలుపుకి పరోక్షంగా సహకరిస్తూ వచ్చారు. తెలంగాణలో బిఆర్ఎస్‌తో ఎన్నికల పొత్తు కుదుర్చుకొంటే, బిజెపి నుండి వచ్చిన వత్తిడుల కారణంగా బి ఎస్‌పి అధిష్టానం వెనుకడుగు వేసిందని, అందుకనే ఆ పార్టీ నుండి బైటకు వస్తున్నానని తెలంగాణ అధ్యక్షునిగా పని చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొనడం ఈ సందర్భంగా గమనార్హం.కేజ్రీవాల్ ఎన్నికలలో పెద్ద ఎత్తున అభ్యర్థులను నిలబెట్టడం ద్వారా గోవా, గుజరాత్, హర్యానా వంటి రాష్ట్రాలలో కాంగ్రెస్ పలు సీట్లను కోల్పోవలసి వచ్చింది.

**కానీ ఇప్పుడు కేజ్రీవాల్ కాంగ్రెస్‌తో సీట్లు సర్దుబాటు చేసుకోవడం** బిజెపికి ఆందోళనకు కారణమైంది. ముఖ్యంగా సాధారణ ప్రజల సాధికారికతకు దారితీసే విధంగా పరిపాలన అందించడంలో కేజ్రీవాల్ పరోక్షంగా ప్రధాని మోడీకి నిత్యం సవాల్ విసురుతున్నారు. భావోద్వేగ అంశాలలో, భారీ పథకాల అమలులో, అంతర్జాతీయంగా తిరుగులేని నాయకుడని ప్రచారం కల్పించుకోవడం ద్వారా బలమైన నాయకుడిగా మోడీని ప్రజలు గుర్తిస్తున్నా, సుపరిపాలన విషయంలో ఆశాభంగం కలిగిస్తున్నారు. ముఖ్యంగా మెరుగైన విద్య, వైద్య సదుపాయాలు కల్పించడంలో, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడంలో ఆయన ప్రభుత్వం చెప్పుకోదగిన కృషి చేయలేకపోతున్నది. అదే సమయంలో దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి. భారత దేశం ప్రపంచంలో ఐదవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా వెలుగొందుతున్నా సాధారణ ప్రజల ఆదాయాలు, జీవన ప్రమాణాలలో చెప్పుకోదగిన మార్పు రావడం లేదు. అయితే, కేజ్రీవాల్ దేశ రాజధాని ఢిల్లీలో పేద ప్రజలకు మేలైన విద్య, వైద్య సదుపాయాలు అందించడం ద్వారా తిరుగులేని ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందుతున్నారు. మొదటిసారిగా గత నెల రోజులుగా బిజెపి కొన్ని ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీం కోర్టు స్పష్టం చేయడంతో పాటు, ఈ సందర్భంగా జరిగిన ఆర్థిక లావాదేవీలు బహిర్గతం చేయడం ఒక విధంగా మోడీ ప్రభుత్వానికి ఊహించని దెబ్బ అని చెప్పవచ్చు.

# 'దక్షిణ' ద్వారం తెరుచుకుంటుందా....?





శివుడూ పార్వతీ పెళ్లిచేసుకుంటుంటే, అంబానీ చిన్న కొడుకు పెళ్లికి వచ్చినట్టుగా, పొలోమంటూ దేవలోకంలోని విఐపీలు అందరూ హిమాలయాలకు వెళ్లారట. ఉత్తరం దిక్కున బరువు ఎక్కువై భూమి ఒకవైపు ఒరిగిపోవడం మొదలుపెట్టింది. దక్షిణంవైపు బరువు పడితే కానీ, తూకం సరిపోదని అనుకుని అగస్త్యముని దక్షిణాదికి వచ్చి, బేలన్స్ చేశాడట. ఇదికాక మరొక కథ కూడా ఉంది. వింధ్య పర్వతం అడ్డూఆపూ లేకుండా నిలువుగా పెరిగిపోవడం మొదలు పెట్టిందట. ఆకాశంలోకి చొచ్చుకువెళ్లి సూర్యుడికీ చంద్రుడికీ కూడా అడ్డుపడి, గ్రహగతులు ఆగిపోయేట్టు చేసిందట. ఉత్తరానికీ దక్షిణానికీ రాకపోకలు కూడా అసాధ్యమయ్యాయట. లోకమంతా వచ్చి మొరపెట్టుకుంటే, అగస్త్యుడు వింధ్య దగ్గరికి వచ్చి, నేను దక్షిణం వైపు పోవాలి దారివ్వమని అడిగాడు. అగస్త్యుడంటేనే పర్వతాలనే కదిలించగలవాడు అని అర్థం కదా, అందుకని గౌరవంగా, వింధ్యుడు తలవంచి, తన ఎత్తు తగ్గించుకున్నాడు. నేను మళ్లీ దక్షిణం నుంచి ఉత్తరం వైపుకు తిరిగివెడతాను, అప్పటిదాకా ఇట్లాగే ఉండు అని అగస్త్యుడు చెప్పాడు. అగస్త్యుడు తిరిగి ఉత్తరదిక్కు వెళ్లలేదు. వంగిపోయిన వింధ్య అట్లాగే, దక్షిణానికి దారి ఇస్తూ మిగిలిపోయింది. దక్షిణం వాళ్లు, ముఖ్యంగా తమిళుల కథలో కొన్ని చేర్పులుంటాయి. తమిళుల మొదటి వ్యాకరణం పేరు అగత్తియం. రాసింది అగస్త్యుడు. అతను ఉత్తరాది నుంచి వస్తే వచ్చాడు కానీ, దక్షిణంలో స్థిరపడి, ద్రావిడం నేర్చుకుని భాషకు సేవ చేశాడు. ఆర్యద్రావిడ సమాజాలకు మధ్య అవరోధాలను తొలగించి, ఉత్తరం వారు దక్షిణానికి వలసరావడానికి, దక్షిణాన్ని లోబరచుకోవడానికి అగస్త్యుడిని ఒక సంకేతంగా చెప్పేవాళ్లు ఉన్నారు. బలిచక్రవర్తి కథ కూడా అటువంటిదే అంటారు! ప్రధానమైన ద్రావిడ భాషలు మాట్లాడే ప్రాంతాలు భారతదేశంలో దక్షిణంలో ఉన్న మాట నిజమే కానీ, అంతమాత్రమే చెబితే సరిపోదు. మూడువైపులా సముద్రం ఆవరించిన ద్వీపకల్ప భాగంలో ఉన్నాయని కూడా చెప్పుకోవాలి. మ?ధ్య ఆసియా నుంచి ఉత్తరభారతంలోకి ప్రవేశించిన ఆర్యులు ఐదునదుల మైదానాల నుంచి క్రమంగా గంగాయమునా బేసిన్‌లోకి విస్తరించి తమదైన నాగరికతను నిర్మించుకున్నారు. తమ ప్రస్థానాన్ని దక్షిణాదికి కొనసాగించడం వారికి అంత సులభం కాలేదు. వంగ దేశం నుంచి సముద్రతీరం గుండా ఓఢ్రదేశం మీదుగా దక్షిణానికి రావడం కూడా ఏమంత సులువు కాలేదు. మరణానంతర వైతరిణి ఒరిస్సాలోనే ఉందట. వింధ్యపర్వతశ్రేణి, దండకారణ్యం నైసర్గిక కుడ్యాలుగా నిలిచాయి. అశోకుడు ఆంధ్ర, కర్ణాటకలలో కూడా శిలాశాసనాలు వేశాడు కానీ, ఈ ప్రాంతాలు మగధలో భాగమయ్యాయో లేదో చెప్పలేము. మౌర్యులు, శాలివాహనులు, కాకతీయులు, మొగలులు, కుతుబ్ షాహిలు దిగువకు దూసుకుపోయారు కానీ, దక్షిణాన ఎంతో కొంత కొస అజేయంగానే మిగిలిపోయింది. భారతీయ జనతాపార్టీ పదేళ్ల రాజసూయంలో కూడా దక్షిణాగ్ర భాగం ఇంకా స్వాధీనం కాలేదు. దక్షిణ రాష్ట్రాలలో కలిగే ప్రయోజనానికి మించి నరేంద్రమోదీ ఎక్కువ కష్టపడుతున్నారు. 'సౌత్ పుష్' అంటున్నది జాతీయ ఇంగ్లీషు మీడియా. కొరకరాని కొయ్యగా ఉన్న దక్షిణాదిని ఈసారి లొంగదీసుకోవాలని ఆయన పట్టుదలగా ఉన్నారని చెప్పుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా దేశమంతటికీ తన రాజకీయ ప్రాబల్యాన్ని విస్తరించినా, ఆ పార్టీలో కూడా ఉత్తరాది నాయకత్వానిదే పైచేయి అయినా, స్థానికంగా అటానమీని అనుమతించింది. అనేక రంగాలలో ఉత్తరాది ఆధిపత్యానికి తానొక రాయబారిగా కాంగ్రెస్ వ్యవహరించలేదు. దక్షిణభారతంలో వ్యక్తమైన స్థానిక ఆకాంక్షలను నెరవేర్చింది, భయాలను గౌరవించింది. ప్రాంతీయ పార్టీ చేతిలో ఓడిపోవడం తమిళనాడుతోనే కాంగ్రెస్ మొదటిసారిగా రుచిచూసింది. బీజేపీ పరిస్థితి వేరు. అతి బలహీనంగా ఉన్న కాలం నుంచి (జనసంఘంగా ఉన్నప్పుడుకూడా) దాన్ని ఉత్తరాది పార్టీగానే దక్షిణాది జనం భావించారు. ఎమర్జెన్సీ తరువాత కానీ, 1980 దశకం చివరలో కానీ ఉత్తరాది మధ్యే వాద పార్టీ ప్రభంజనాలు దక్షిణాదిని పెద్దగా కదిలించలేదు. తమ జాతీయవాదానికి దేశవ్యాప్త ఆమోదం కోసం, 'ప్రగతిశీల' భారతంలో విజయం కోసం భారతీయ జనతాపార్టీకి బెంగాల్ లోను, దక్షిణ రాష్ట్రాలలోను గెలుపు కావాలి. అతి సూక్ష్మ స్థాయి నుంచి పనిచేసుకుంటూ పథకం ప్రకారం బలాన్ని పెంచుకోగలిగిన 'శక్తి' బీజేపీకి ఉంది. కార్యశీలురైన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఫలితాలు ఎట్లా ఉన్నా, వారి ప్రయత్నాన్ని మెచ్చుకోవచ్చు. అశోకుడు కాకపోయినా, హర్షుడు కొంత, ఔరంగజేబు మరికొంత దక్షిణంలోకి చొచ్చుకువచ్చి ఆ తరువాత ఆగిపోయారు. గోవా ఎట్లాగూ భౌగోళికంగా తప్ప సాంస్కృతికంగా దక్షిణం కాదు. తక్కిన ఐదు రాష్ట్రాలూ ఉత్తరాది ప్రభావం నుంచి సమానంగా రక్షించుకున్నాయని చెప్పలేము. కర్ణాటక విజయం బీజేపీకి కొత్తేమీ కాదు. పొత్తులతోనో, ఫిరాయింపులతోనో బీజేపీ కర్ణాటకలో ఒకటి రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో 2014లోనే ఒక మైనర్ భాగస్వామిగా అయినా ప్రభుత్వంలో ఉన్నది. తెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్‌లో ప్రభావశీలమైన ఉనికితో ఎప్పటి నుంచో ఉంటూ, గత పార్లమెంటు ఎన్నికలలో నాలుగు స్థానాలతో, సుమారు 20 శాతం ఓట్లతో పెద్ద విజయవిస్తరణ చేసుకోగలిగింది. కేరళలో 2016లో ఒక ఎమ్మెల్యేను గెలిపించుకున్న బీజేపీ, 2021లో 11 శాతానికి పైగా ఓట్లను సంపాదించింది. మరి కొత్తగా, దక్షిణ ద్వారాన్ని బద్దలు కొట్టడమనే ఘనకార్యంలో మోదీ ప్రస్తుతం ఉన్నారని అనడం సమంజసమేనా? అక్కడక్కడా బలంగానో, బలహీనంగానో ఉనికిలో ఉన్నప్పటికీ, సారాంశంలో దక్షిణాది ఇంకా పట్టుబడలేదన్న లోటు మాత్రం బీజేపీకి ఉన్నది. వింధ్యపర్వతం ఎక్కడున్నదో గుర్తించి, దాన్ని వంచగలిగితే, దక్షిణంలోకి మహాద్వారం తెరుచుకుంటుందని ఆశిస్తున్నది. అంచుల్లో పలచబడుతున్నప్పటికీ, లోలోపలి అడవి దట్టంగానే మిగిలినట్టు, దక్షిణాదిలో కూడా కొంత అతి దక్షిణం ఉన్నది. భావపరంగానూ, భౌగోళికంగానూ కూడా ఉత్తరత్వానికి కొరుకుడుపడని కంచుకోటలు దక్షిణంలో మిగిలే ఉన్నాయి. వాటిని కొట్టగలిగితే, గంగా కావేరీ అనుసంధానం జరిగినట్టే. బీజేపీకి, మోదీకి అదే అంతిమలక్ష్యం కావచ్చును కానీ, ప్రస్తుతం దానిమీదే గురిపెట్టారనడం సరికాదు. ఎందుకంటే, మోదీ 'సౌత్ పుష్' దాడి వ్యూహం కాదు. ఆత్మరక్షణా వ్యూహం మాత్రమే. ఉత్తరాదిలో ఈ సారి తరిగిపోయే అవకాశమున్న సంఖ్యను దక్షణాదిలో భర్తీ చేసుకోవడం కోసం మాత్రమే ఈ ప్రత్యేక ప్రయత్నం. తమిళనాడు, కేరళల్లో ప్రస్తుతానికి కొత్త ఆశ ఏమీ లేదు. ఆ రెండు రాష్ట్రాలలో గతం కంటె నాలుగు ఓట్లు పెంచుకోవడమే లక్ష్యం. అతి దక్షిణం అని భౌగోళికంగా చెప్పగలిగే రాష్ట్రాలు ఆ రెండూ. కర్ణాటకలో ఒకవేళ కాంగ్రెస్ మీద విముఖత కలిగినా, గతంలో ఉన్న బలాన్ని దాదాపుగా నిలుపుకోవడమే తప్ప అదనపు ప్రయోజనం లేదు. సాంస్కృతికంగా, సామాజికంగా ఆ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలు ఈ పాటికే ఉత్తరాది ప్రభావంలో పడిపోయాయి.

# నగదు కష్టాలు

**సిరిసిల్ల :** ఎన్నికలు అనగానే నగదుతోనే ముడిపడి ఉంటుంది. డబ్బులు, మద్యం, ఓటర్లను ప్రలోభాలు గురిచేయడానికి అస్త్రంగా వాడుకుంటారు. వీటిని అరికట్టడానికి ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టి పెట్టింది. లోక్‌సభ షెడ్యూల వెలువడడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీనికి అనుగుణంగానే రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోలీసులు ఎన్నికల బృందాలు ముమ్మరంగా తనిఖీలు మొదలు పెట్టారు. జిల్లా సరిహద్దుల్లో ఆరు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటలు తనిఖీలు చేస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా ఉన్నా సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో మరింత నిఘాను పెంచారు. సిరిసిల్ల నుంచి బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు కే తారకరామారావు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తుండడం, వేములవాడ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ఉన్నారు. ఈసారి రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఓటు బ్యాంక్‌ను పెంచుకునే దిశగా ఓటర్లను ఎక్కువగా ప్రలోభాలకు గురిచేస్తారనే ప్రచారం కూడా ఉంది. దీంతో ముందుగానే తనిఖీలు పెంచడంతో చిరు వ్యాపారులు సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. సిరిసిల్లకు చెందిన స్వామి కారు కొనుగోలుకు సంబంధించి 50 వేల రూపాయలతో హైదారాబాద్ నుంచి సిరిసిల్లకు వస్తుండగా పట్టుకున్నారు. వ్యాపారులు, బ్యాంక్‌లకు వెళ్లడానికి కూడా ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. 50 వేల రూపాయలకు మించి నగదు తీసుకవెళితే అందుకు సంబంధించిన రుజువు పత్రాలు చూపించాలి. లేనిపక్షంలో వాణిజ్య పన్నుల శాఖకు, అధికారుల బృందానికి అప్పగిస్తారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సరిహద్దుల్లో ఆరు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జిల్లెల్ల చెక్‌పోస్టు, గంభీరావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో పెద్దమ్మ చెక్‌పోస్టు, ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెంకట్రావుపల్లి చెక్‌పోస్టు, వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫాజుల్‌నగర్ చెక్‌పోస్టు, బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో కొదురుపాక చెక్‌పోస్టు, రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలో మానాల క్రాస్ రోడ్డు వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు. 50 వేల రూపాయలకు మించి నగదు తీసుకవెళితే అందుకు సంబంధించిన రుజువు పత్రాలు చూపించాలి. లేనిపక్షంలో వాణిజ్య పన్నుల శాఖకు, అధికారుల బృందానికి అప్పగిస్తారు. మరోవైపు జిల్లాలోని బ్యాంకుల్లో నగదు లావాదేవీలపైకూడా ఎన్నికల కమిషన్ దృష్టి పెట్టింది.

# మానేరులో ఇసుక తవ్వకాలకు గ్రీన్ సిగ్నల్



**పెద్దపల్లి :** మానేరు నదిపై గల పద్దెనిమిది ఇసుక క్వారీల్లో ఇసుక తవ్వకాలకు మరో ఏడాది పాటు గడువు పొడిగిస్తూ డిస్ట్రిక్ట్ లెవెల్ స్యాండ్ కమిటీ(డీఎల్ఎస్‌సీ) నిర్ణయం తీసుకున్నది. ఇదివరకు క్వారీలను నిర్వహించిన కాంట్రాక్టరకే ఇసుక తోడే బాధ్యతను అప్పగించారు. గతంలో ఆయా క్వారీల్లో అనుమతించిన ఇసుకలో తోడింది పోను మిగింది తోడేందుకు అనుమతి ఇచ్చారు. మానేరు నదిపై సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి, గట్టెపల్లి, కదంబాపూర్, తొగర్రాయి, ఓదెల మండలం మడక, గుండ్లపల్లి, కనగర్తి, పొత్కపల్లి, రూప్‌నారాయణపేట, ఇందుర్తి, గుంపుల, కాల్వశ్రీరాంపూర్ మండలం మీర్జంపేట్, మొట్లపల్లి, ముత్తారం మండలం ఓడేడు, అడవిశ్రీరాంపూర్, మంథని మండలం గోపాల్‌పూర్, చిన్నఓదాల వద్ద నిర్మిస్తున్న చెక్‌డ్యామ్‌ల లోపల ఇసుక నిల్వలు బాగా ఉన్నాయని, అవి తోడకుండా చెక్ డ్యాములు నిర్మించడం వల్ల ఆశించిన మేరకు నీటినిల్వలు ఉండవని అధికారులు భావించారు. ఆ మేరకు నీటి పారుదల శాఖ, భూగర్భ జల శాఖ, గనులు శాఖాధికారులు జాయింట్‌గా మానేరుపై ఎక్కడెక్కడ ఎంత ఇసుక నిల్వ ఉంది, ఎంత లోతులో తీయాలి, ఎన్ని క్వారీలను ఏర్పాటుచేయాలి అనే అంశంపై సర్వే నిర్వహించారు. ఆ మేరకు రెండు మీటర్ల లోతు వరకు 1,32,67,620 క్యూబిక్ మీటర్ల ఇసుకను తోడాలని, ఇందుకోసం 25చోట్ల క్వారీలను ఏర్పాటు చేయాలని డీఎల్ఎస్‌సీ నిర్ణయం తీసుకుని ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఆ నివేదికను పరిశీలించిన అప్పటి ప్రభుత్వం ఇసుక క్వారీల కోసం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వాటి నిర్వహణ బాధ్యతను టీఎస్ఎండీసీకి అప్పగించారు. 2022 జనవరి 11వ తేదీన టీఎస్ఎండీసీ ఇసుక రీచుల్లో ఇసుకను తోడి వాహనాల ద్వారా డంపింగ్ యార్డుల వరకు తీసుకవచ్చి అక్కడ లోడింగ్ చేసేందుకు టెండర్లను ఆహ్వానించింది. పలువురు కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొని ఇసుక రీచులను దక్కించుకున్నారు. 2023 డిసెంబర్ నెలాఖరు వరకు ఇసుక తవ్వకాలకు డీఎల్ఎస్‌సీ అనుమతి ఇచ్చింది. మానేరు నుంచి ఇసుకను తవ్వి స్టాక్ యార్డుల్లో పోసిన తర్వాత అక్కడినుంచి టీఎస్ఎండీసీ బుకింగ్ చేసుకున్న వారికి క్యూబిక్ మీటర్‌కు 650 రూపాయల చొప్పున విక్రయించింది. 25 ఇసుక రీచులను కాంట్రాక్టర్లు దక్కించుకున్నప్పటికీ అడవిశ్రీరాంపూర్ 1, అడవి శ్రీరాంపూర్ 2, కనగర్తి1, కనగర్తి 2, పొత్కపల్లి 1, పొత్కపల్లి 2, గుండ్లపల్లి 1, గుండ్లపల్లి 2, కిష్టంపేట్, గోపాల్‌పూర్, మడక 1, మడక 2, ముత్తారం, ఓడేడు 1, గుంపుల, ఇందుర్తి, కిష్టంపేట్ 2, తొగర్రాయి, నీరుకుల్ల, గొల్లపల్లి, తదితర క్వారీల నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు సుమారు 65 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తరలించారు. స్టాక్ యార్డుల్లో ఇంకా 5 లక్షల క్యూబిక్ మీటర్ల వరకు ఇసుక పోశారు. ప్రస్తుతం ఆయా యార్డుల్లో నిల్వ ఉన్న ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక తరలించడం వల్ల ఓదెల, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్, ముత్తారం, మంథని ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని, రోడ్లన్నీ ధ్వంసం అవుతున్నాయని, దుమ్ముధూళితో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని, పర్యావరణ అనుమతులు లేకుండానే ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని, వాటిని నిలిపివేయాలని మానేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పలువురు చెన్నై గ్రీన్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు.

# క్షయ రహిత భారతాన్ని నిర్మించలేమా...!

24 మార్చి 1882న 'డా: రాబర్ట్ కోచ్' అనే శాస్త్రజ్ఞుడు క్షయవ్యాధికి (ట్యుబర్క్యులోసిస్, టిబి)కి 'మైకోబాక్టీరియమ్ ట్యుబర్క్యులోసిస్', 'మై. బాసిల్లస్' బ్యాక్టీరియా కారణమని తొలిసారి ప్రపంచ మానవాళికి ప్రకటించడం జరిగింది. ఈ విప్లవాత్మక ఆవిష్కరణ ఫలితంగా 'ట్యుబర్క్యులోసిస్ లేదా టిబి'ని శ్వాసకోశ (ఊపిరితిత్తుల) వ్యాధిగా గుర్తించడంతో పాటు చికిత్సలో కూడా ముందడుగు వేయుటలో సఫలత సాధించారు. ప్రపంచవ్యాప్తంగా రోజుకు 4000 మంది టిబి వ్యాధితో మరణించడం, 28,000 మంది దిగువ, అల్పాదాయ వర్గాల రోగులు క్షయరోగం సోకి బాధ పడుతుండడం జరుగుతోంది. 2000ల సంవత్సరం తరువాత ప్రతి ఏటా దాదాపు 63 మిలియన్ల టిబి రోగుల ప్రాణాల్ని కాపాడటం జరుగుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించిన 11 ప్రపంచ ప్రజారోగ్య సమస్యలలో ఏయిడ్స్, మలేరియా, హెపటైటిస్ లాంటి అంటువ్యాధుల జాబితాలో క్షయవ్యాధి ఒకటిగా చేర్చడం జరిగింది. వ్యాధిగ్రస్తులు దగ్గినపుడు, తుమ్మినపుడు వెలువడే సూక్ష్మ బింధువులు ఇతరులు పీల్చినపుడు టిబి అంటువ్యాధి ఇతరులకు సంక్రమిస్తుందని తెలుసుకోవాలి. ప్రపంచ మానవాళిని శతాబ్దాలుగా పట్టి పీడిస్తున్న ఇలాంటి భయంకర క్షయ అంటువ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించే దిశలో ఐరాస చేపట్టిన 'ప్రపంచ క్షయ నిర్మూలన దినాన్ని' ప్రతి ఏటా 24 మార్చి రోజున 1982 నుంచి నిర్వహించుట జరుగుతోంది. ప్రపంచ క్షయ నిర్మూలన దినం-2024 ప్రకారం 'అవును, మనం టిబిని అంతం చేయవచ్చు (ఎస్ వి కెన్ ఎండ్ టిబి)' అనబడే నినాదం తీసుకోబడింది. ఐరాస అంచనాల ప్రకారం 2023 నాటికి 3.5 మిలియన్ల పిల్లలు, 1.5 మిలియన్ల పెద్దలను టిబి వ్యాధి నుంచి విముక్తం చేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. క్షయ వ్యాధి నిర్మూలన, చికిత్స, వ్యాధి కట్టడిలో జవాబుదారీతనం, టిబి నిర్మూలనకు/పరిశోధనలకు అవసర నిధుల సమీకరణ, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షను తొలగించడం, టిబి రోగుల్లో ఆత్మవిశ్వాసం నింపడం లాంటి చర్యలు చేపట్టడం జరుగుతున్నది. భయానక క్షయ వ్యాధి ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య, సాంఘీక, ఆర్థిక దుష్పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని గమనించాలి. ప్రపంచంలోనే అతి పెద్ద ఆరోగ్య సమస్యగా నిలిచిన టిబితో భారత్‌లో ప్రతి ఏటా 2.20 లక్షల మరణాలు క్షయ వ్యాధి వల్ల సంభవిస్తున్నాయి. ప్రపంచ టిబి మరణాల్లో ఇండియా 3వ స్థానంలో ఉంది. అత్యధిక టిబి మరణాలు రికార్డు అవుతున్న 8 దేశాల (ఇండియా, ఇండోనేషియా, చైనా, ఫిలిప్పీన్స్, పాకిస్థాన్, నైజీరియా, బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా) జాబితాలో ఇండియా ప్రథమ స్థానంలో ఉంది. 2016లో 2.79 మిలియన్ల కొత్త టిబి కేసులు, 4.35 లక్షల టిబి మరణాలు, 1.47 లక్షల ఔషధ-నిరోధకత కేసులు, 46 శాతం చికిత్సతో నయం అయిన వారు ఉన్నారని తేలింది. ఇండియాలో 2006-14 మధ్య క్షయ వల్ల ఒక బిలియన్ డాలర్ల ఆర్థిక నష్టం వాటిల్లిందని అంచనా. ఇండియాలో 2025 వరకు క్షయ నిర్మూలన చేయాలనే ఆశయంతో 'జాతీయ టిబి నిర్మూలన కార్యక్రమం' తీసుకోవడం, పలు రకాల చర్యలు చేపట్టడం జరుగుతోంది. వ్యాధిగ్రస్తుల్ని గుర్తించడం, చికిత్సలు అందించడం, వ్యాధి నిర్మూలనకు 'నిక్షయ్ పోషన్ యోజన' ద్వారా పోషకాహారాన్ని అందించడం లాంటి చర్యలు తీసుకుంటున్నారు. టిబిలో ఆక్టివ్ ( వ్యాధి లక్షణాలు కలిగిన వారు), ఇనాక్టివ్ (రోగం ఉన్నా తెలియని వారు) రకాలు ఉన్నాయి. ఊపిరితిత్తులకు సంబంధించిన అంటువ్యాధిగా క్షయరోగాన్ని గుర్తించినప్పటికీ, దీనితో కిడ్నీ, ఎముకలు, కీళు ్ళ, లింఫ్ నోడ్స్ లాంటి ఇతర అవయవాలు కూడా ప్రభావితం అవుతాయి. క్షయవ్యాధి లక్షణాల్లో దీర్ఘకాలపు దగ్గు, ఆకు పచ్చ/పసుపు/రక్తపు కఫం రావడం, బరువు తగ్గడం, జ్వరం, చేమట, ఛాతి నొప్పి, ఆకలి మందగించడం, కండరాల నొప్పి, శ్వాస ఇబ్బంది లాంటివి కనిపిస్తాయి. వ్యాధిగ్రస్తులు మందుల్ని విధిగా వేసుకోవడం, డాక్టర్‌ను సంప్రదించడం, దగ్గినపుడు/తుమ్మినపుడు తుండు గుడ్డతో కప్పుకోవడం, తరుచుగా చేతులు శుభ్రపరుచుకోవడం, ఇతరులకు దూరంగా ఉండడం, గదిలో గాలి ప్రవహించేలా/ వెలుతురు నిండుగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవడం, ప్రజారవాణ వినియోగానికి దూరంగా ఉండడం లాంటి జాగ్గత్తలు తీసుకుంటూ, వ్యాధి వ్యాప్తిని కట్టడి చేయడం మనందరి బాధ్యతగా గుర్తించాలి. ఆంటీబయాటిక్స్‌తో నయం చేయగల టిబితో పాటు ఔషధ-నిరోధక స్థితి కూడా కనిపిస్తున్నది. 2017-25 మధ్య క్షయవ్యాధిని భారత్ నుంచి తరమటానికి 'నేషనల్ స్ట్రాటజిక్ ప్లాన్'తో పాటు 'నేషనల్ టిబి నిర్మూలన కార్యక్రమం' కూడా తీసుకున్నారు. వ్యాధిగ్రస్తులకు పోషకాహారం, ఆరోగ్య సంస్థలకు చేయూత, ప్రైవేట్ చికిత్సకు సహాయం, గిరిజన టిబి రోగులకు ఉచిత రవాణా వసతి లాంటి టిబి నిర్మూలన చర్యలు ప్రభుత్వాలు తీసుకుంటున్నాయి. పిల్లల్లో టిబిని గుర్తించడం, కొన్ని సందర్భాలలో వ్యాధి లక్షణాలు కనిపించక పోవడం అతి పెద్ద సమస్యలుగా అడ్డు నిలుస్తున్నాయి. పిల్లలకు 'బిసిజి' టీకాలు ఇప్పించడం ఎన్నటికీ మరువరాదు. వ్యాధిగ్రస్తులు మందుల్ని విధిగా వేసుకోవడం, డాక్టర్‌ను సంప్రదించడం, దగ్గినపుడు/తుమ్మినపుడు తుండు గుడ్డతో కప్పుకోవడం, తరుచుగా చేతులు శుభ్రపరుచుకోవడం, ఇతరులకు దూరంగా ఉండడం, గదిలో గాలి ప్రవహించేలా/ వెలుతురు నిండుగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవడం, ప్రజారవాణ వినియోగానికి దూరంగా ఉండడం లాంటి జాగ్గత్తలు తీసుకుంటూ, వ్యాధి వ్యాప్తిని కట్టడి చేయడం మనందరి బాధ్యతగా గుర్తించాలి. ఈ క్రమంలో 2024 నినాదాన్ని నిజం చేస్తూ క్షయవ్యాధి రహిత భారతాన్ని నిర్మించడంలో మన వంతు కర్తవ్యాన్ని నిర్వహిద్దాం, ఆరోగ్య భారతాన్ని ఆకాంక్షిద్దాం. ప్రపంచవ్యాప్తంగా రోజుకు 4000 మంది టిబి వ్యాధితో మరణించడం, 28,000 మంది దిగువ, అల్పాదాయ వర్గాల రోగులు క్షయరోగం సోకి బాధ పడుతుండడం జరుగుతోంది.

# అరెస్టు చేయాలంటే ఈడీ కారణాలు చెప్పాల్సిందే



న్యూఢిల్లీ: ఏదైనా కేసులో అరెస్టు చేసేముందు నిందితుడికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) లిఖితపూర్వకంగా కారణాలు చెప్పాల్సిందేనని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. గతేడాది పంకజ్ బన్సల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పును సమర్థించింది. ఈ తీర్పుపై కేంద్రం వేసిన సమీక్ష పిటిషన్‌ను కొట్టివేసింది. "సమీక్ష పిటిషన్.. అందుకు సంబంధించిన పత్రాలను చాలా జాగ్రత్తగా పరిశీలించాం. తీర్పులో ఎలాంటి తప్పిదం కనిపించలేదు" అని జస్టిస్ ఎ.ఎస్.బోపన్న, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం పేర్కొంది. మనీలాండరింగ్ చట్టంలోని సెక్షన్ 19.. ఈడీ అధికారులకు అరెస్టు చేసే అధికారాన్నిస్తుంది. అందులో అరెస్టు సమయంలో నిందితుడికి కారణాలు వివరించాలని తెలిపింది. అయితే ఆ సమాచారాన్ని ఎలా ఇవ్వాలన్న స్పష్టత ఆ సెక్షన్‌లో లేదు. బన్సల్ కేసులో నిందితులకు లిఖితపూర్వకంగా ఈడీ కారణాలు తెలపకపోవడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. జీ ఎంటర్‌టైన్‌మెంట్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ మీడియా గ్రూప్‌నకు చెందిన బ్లూమ్‌బెర్గ్ ప్రచురించిన కథనం తొలగించాల్సిందిగా ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఖాతా పుస్తకాల్లో 241 మిలియన్ డాలర్ల మేరకు అవకతవకలు జరిగిన విషయాన్ని సెబీ గుర్తించిందని గత నెల 21న బ్లూమ్‌బెర్గ్ కథనం ప్రచురించింది.

# సిఏఏపై పోరు కొనసాగుతుంది
## కొజికోడ్ బీచ్ ర్యాలీలో కేరళ సిఎం విజయన్

కొజికోడ్ : సిఎఎ (పౌరసత్వ సవరణ చట్టం)ను అమలుచేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం, దేశం నురచి రోహింగ్యా శరణార్థులను బయటకు పంపేందుకు వ్యూహాత్మకంగా పన్నిన ఎత్తుగడేనని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. సిఎఎకు వ్యతిరేకంగా కొజికోడ్ బీచ్‌లో శుక్రవారం ఎల్‌డిఎఫ్ వేలాది మందితో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. శరణార్థుల పట్ల సార్వజనీన దృక్పథాన్ని సిఎఎ ఉల్లంఘిస్తోందని, దీనివల్ల ప్రపంచ దేశాల్లో భారత్ ఏకాకి అయ్యే పరిస్థితి వస్తుందన్నారు. పౌరసత్వానికి మతాన్ని ఒక ప్రామాణికంగా తీసుకొస్తూ మోడీ ప్రభుత్వం తీసుకున్న చర్యను ఐక్యరాజ్య సమితి, అమ్నెస్టీ ఇంటర్నేషనల్ సహా ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.. కేవలం దేశ పౌరులకే కాకుండా ఇక్కడ నివసించే వారందరికీ రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిందని, మతం ప్రాతిపదికన విభజించడాన్ని రాజ్యాంగం అనుమతించదన్నారు. సిఎఎ, జాతీయ పౌర పట్టిక అమలుకు తాము మద్దతిచ్చేది లేదని ప్రకటించిన మొదటి రాష్ట్రం కేరళ అని విజయన్ చెప్పారు.



సిఎఎకు వ్యతిరేకంగా సుప్రీంను ఆశ్రయించిన మొదటి రాష్ట్రం కూడా కేరళేనని చెప్పారు. దేశంలో చాలా మంది ప్రజలు తమ భవిత్యవం కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని, తాము ఇక్కడ వుండగలమా లేదా అని వారు భయపడుతున్నారని అన్నారు. సంఘ్ పరివార్ బెదిరింపులు కూడా ఈ భయానికి ఒక కారణమన్నారు. సిఏఏపై తన వైఖరిని కాంగ్రెస్ నాయకత్వం ఇంతవరకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీ లోక్‌సభకు పోటీ చేస్తున్న ఎల్‌డిఎఫ్ అభ్యర్థుల ప్రచారానికి వేదికగా మారింది. ఎల్‌డిఎఫ్ అభ్యర్థులైన ఎలామరమ్ కరీమ్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, కెకె శైలజ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.


# వాతావరణ లక్ష్యాల సాధనకు అణు ఇంధనమే మార్గం




బ్రస్సెల్స్ : శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించడం, ఇంధన భద్రతను పెంపొందించడం, ఆర్థికాభివృద్ధికి ప్రోత్సాహాన్నిందించడం వంటి అంతర్జాతీయ సవాళ్ళను ఎదుర్కొనడంలో అణు ఇంధన పాత్ర ప్రముఖమైనదని వక్తలు పేర్కొన్నారు. కర్బన ఉద్గారాలు తగ్గించేందుకు నిర్దేశించుకున్న వాతావరణ లక్ష్యాలను సాధించడానికి అణు ఇంధనమే మార్గమని తెలిపారు. గురువారం ఇక్కడ ప్రారంభమైన ప్రపంచ తొలి అణు ఇంధన సదస్సులో 30కి పైగా దేశాల నుండి ప్రతినిధులు పాల్గన్నారు. వీరిలో ప్రభుత్వాధినేతలు, నాయకులు, సీనియర్ ప్రతినిధులు, అంతర్జాతీయ సంస్థల నేతలు వున్నారు. కేవలం అణు ఇంధనంపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తూ జరిగిన మొదటి అత్యున్నత స్థాయి సమావేశం ఇదే. అంతర్జాతీయ ఇంధన సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాతి బైరోల్ మాట్లాడుతూ, అణు ఇంధనం పోషించే అద్వితీయమైన పాత్రను నొక్కి చెప్పారు. అణు విద్యుత్ మద్దతు లేకుండా వాతావరణ లక్ష్యాలను మనం సకాలంలో సాధించలేమని అన్నారు. ఐఎఇఎ డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రాసి మాట్లాడుతూ, పరిశుద్ధమైన ఇంధనంలో నాలుగవ వంతును అణు ఇంధనం అందిస్తోందన్నారు. సురక్షితమైన, భద్రమైన, అణు వ్యాప్తి లేని రీతిలో అణు ఇంధనాన్ని ఉపయోగించేలా తమ సంస్థ సాయపడుతుందని చెప్పారు. అణు విద్యుత్ శాఖల నిర్వహణలో చైనా అంతర్జాతీయంగా మూడో స్థానంలో వుందన్నారు. ఇంకా కొత్త యూనిట్లు అనేకం ప్రస్తుతం నిర్మాణంలో వున్నాయని చైనా అణు ఇంధన సంస్థ తెలిపింది.

# టిడిపితో మాదిగలది శాశ్వత బంధం : చంద్రబాబు నాయుడు

తెలుగుదేశం పార్టీతో మాదిగలది శాశ్వత బంధం అని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మాదిగ వర్గ ప్రజల అభ్యున్నతికి మొదటి నుంచీ పనిచేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని చంద్రబాబు అన్నారు. టిడిపి విజయంలో మాదిగలు కీలక పాత్ర పోషించాలని చంద్రబాబు అన్నారు. ఏపిలోని ఉండవల్లిలో టిడిపి అధినేత చంద్రబాబుతో మందకృష్ణ మాదిగ, ఎంఆర్‌పిఎస్ నేతలు భేటీ అయ్యారు. చంద్రబాబు నాయుడుకు ఈ సందర్భంగా పలు అంశాలపై వినతిపత్రం ఇచ్చారు. రేపు కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొట్ట మొదటి సమావేశాల్లోనే ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేయాలని మందకృష్ణ కోరారు. రాజ్యాంగ బద్ద సంస్థల్లో మాదిగ వర్గానికి తగు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అలాగే అన్ని కార్పొరేషన్‌లలో, నామినేటెడ్ పదవుల్లో మాదిగ వర్గానికి పెద్ద ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం ఎస్‌సిలకు రద్దు చేసిన అన్ని పథకాలు తిరిగి ప్రారంభించాలని విన్నవించారు. ఎన్‌డియేకు తమ మద్దతు ఉంటుందని మంద కృష్ణ మాదిగ ఈ సందర్భంగా చంద్రబాబుకు తెలిపారు. అనంతరం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ 40 ఏళ్లుగా పార్టీని మాదిగ సామాజికవర్గం ఆదరిస్తోందని అన్నారు. అలాంటి



మాదిగ వర్గాన్ని పైకి తెచ్చేందుకు తాను ఎప్పుడూ ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. ఏపిలో తెలుగుదేశం గెలుపు మాదిగల గెలుపు అవుతుందని అన్నారు. ప్రభుత్వంపై తెలుగు దేశం ఎంత గట్టిగా పోరాడుతుందో...అంతకంటే గట్టిగా ఎంఆర్పిఎస్ పోరాటం చేస్తోందని అన్నారు. మాదిగ సామాజికవర్గాన్ని అధికారంలో భాగస్వాములు చేస్తా అని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాదిగ సమస్యలపై చంద్రబాబుతో మందకృష్ణ ప్రత్యేకంగా చర్చించారు. అధికారంలోకి వచ్చిన తరవాత మాదిగ వర్గానికి న్యాయం చేయాలని కోరారు.

# భారత్ ఎప్పుడూ మిత్రుడే.. మాట మార్చిన మాల్దీవులు..



**మాలె :** మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు ఒక్కసారిగా మాటమార్చారు. ఇన్ని రోజులు భారత్, ప్రధాని మోదీపై అక్కసు వెళ్లగక్కిన ముయిజ్జు సడెన్‌గా మాట మార్చారు.మాల్దీవులకు భారత్ ఎప్పటికీ సన్నిహిత మిత్రుడే అంటూ ఆయన కామెంట్స్ చేశారు. ఇంతకీ ఆయన ఇలా ఎందుకు మాట్లాడారంటే?.. గతేడాది చివరి నాటికి భారత్‌కు మాల్దీవులు దాదాపు 400.9 మిలియన్ డాలర్ల బకాయిపడింది. దీనిని తిరిగి చెల్లించడంలో ఉపశమనం కలిగించాలని మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు ప్రాధేయపడుతున్నారు. ఇందులో భాగంగానే కొత్త ప్లాన్ రచించారు. అయితే, అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ముయిజ్జు తొలిసారిగా స్థానిక మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఆయన ప్రస్తావించారు. మాల్దీవులకు సాయం అందించడంలో భారత్ కీలక పాత్ర పోషించిందని, పెద్ద మొత్తంలో ప్రాజెక్టులను నిర్మించిందని కొనియాడారు. ఇరుదేశాల మధ్య స్నేహసంబంధాలు కొనసాగుతాయనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. రుణాలను తిరిగి చెల్లించడంలో మాల్దీవులకు ఉపశమనంకలిగించాలని భారత్‌ను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ముయిజ్జు..'గత ప్రభుత్వాలు చేపట్టిన చర్యల వల్ల భారత్ నుంచి తీసుకున్న అప్పులు భారీగా పేరుకుపోయాయి. తిరిగి చెల్లించడంలో మినహాయింపు కోరుతూ ఆ దేశంతో చర్చలు జరుపుతున్నాం. ప్రస్తుతం ఇక్కడ నిర్మాణంలో ఉన్న ఏ ప్రాజెక్టుకు విఘాతం కలిగించం. వీలైనంత త్వరగా వాటిని పూర్తి చేసేందుకు సహకరిస్తాం' అని కామెంట్స్ చేశాం.

# ఇకపై జాత్యాహంకారాన్ని సహించేది లేదు




బ్రసీలియా: ఇకపై జాత్యాహంకారాన్ని సహించేది లేదని బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా పేర్కొన్నారు. దాన్ని ప్రపంచవ్యాప్తంగా పోరాటం చేయాల్సిన 'రుగ్మత'గా అభివర్ణించారు. బ్రెజిల్‌లోని నల్లజాతి యువతకు మద్దతుగా ప్రవేశపెట్టిన నూతన పథకాలను ప్రకటించారు. ఈ పథకంలో భాగంగా విద్య, ఆరోగ్యం, సంస్కృతి, క్రీడలలో వారిని ప్రోత్సహిస్తామని అన్నారు. సామాజిక భద్రత కూడా కల్పించేలా అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. జాత్యాహంకారాన్ని పూర్తిగా నిర్మూలించాలని పేర్కొన్నారు. ప్రతి రోజూ నల్లజాతీయులు పలు మానవ హక్కుల ఉల్లంఘనల బాధితులుగా మారుతున్నారని, ఇకపై దాన్ని సహించబోమని అన్నారు. ఇకపై నల్ల జాతీయులను చూసినపుడు రంగు గుర్తుకు రాకూడదని, ఓ వ్యక్తిగా గుర్తించాలని అన్నారు.

# చేతితో భోజనం చేయడం వల్ల ఏకంగా అన్ని రకాల ప్రయోజనాలా?

కాలం మారిపోవడంతో మనుషుల ఆహారపు అలవాట్లు జీవనశైలి నడవడిక ప్రతి ఒక్కటి కూడా మారిపోయాయి. ఇదివరకటి రోజుల్లో మన పెద్దలు ఆహారం భోజనం చేసేటప్పుడు ఎంచక్కా అందరూ ఒకేసారి నేలపై కూర్చుని చక్కగా చేతితో భోజనం చేసేవారు. కానీ రాను రాను ఆ రోజులే కరువయ్యాయి. డైనింగ్ టేబుల్ పై కూర్చుని స్పూన్ లతో తినడం అలవాటు చేసుకున్నారు. కేవలం ఒక్క ఆహార మాత్రమే కాకుండా టిఫిన్ లంచ్ ఇవన్నీ కూడా చేతితో కాకుండా స్పూన్ లతో తినడానికి బాగా అలవాటు పడిపోయారు. ఇంకా చెప్పాలంటే ఈ తరం రాబోయే తరం ప్రేక్షకులకు కూడా ఇవి అలవాట్లు నేర్పిస్తుండడం ఆశ్చర్య పోవాల్సిన విషయం. ఆ సంగతి పక్కన పెడితే స్పూన్లతో కాకుండా చేతితో ఆహారం తింటే ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగుతాయి అంటున్నారు నిపుణులు. అందరికీ ఆ ప్రయోజనాలు ఏంటో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. చేతులతో తినే సమయంలో ముందుగా ఆహారాన్ని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకుంటాం. ఇది ఆహారం త్వరగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. ఇది జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. పోషకాలను బాగా గ్రహించడంలో సహాయపడుతుంది. చేతులతో ఆహారం తినేవారిలో ఆహారాన్ని చేయి తాకగానే జ్ఞాన నాడుల ద్వారా మెదడు, పొట్టకు సంకేతాలు చేరుతాయి. దీని వల్ల జీర్ణరసాలు, ఎంజైములు విడుదలై జీర్ణక్రియ సక్రమంగా సాగుతుంది. చేతులతో తినే సమయంలో ఆహారాన్ని నేరుగా చేతిలోకి తీసుకుని నోటిలో పెట్టుకుంటాం. అప్పుడు ముక్కుద్వారా ఆ వాసన ఆహారం రుచిని మరింత పెంచుతుంది. ఇది చెంచాతో తినేటప్పుడు అనుభవించదు. మన చేతులతో తినేటప్పుడు మనం తినే ఆహారాన్ని సహజంగా కొలుస్తాము. చెంచాతో తింటే అతిగా తినే అవకాశం ఉంది. చెంచాతో అతిగా, వేగంగా తినడం వల్ల శరీరంలోని రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే ప్రమాదం కూడా ఉంది. ఇది టైప్ -2 డయాబెటిస్‌కు దారితీస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మనం మన చేతులతో తినేటపుడు ఆహారం ఆకృతి, ఉష్ణోగ్రతను పసిగట్టవచ్చు. ఇది ఆహారంతో మరింత సన్నిహిత సంబంధాన్ని ఏర్పరుస్తుంది. అంతేకాదు మన చేతులు, కడుపు, పేగులు కొన్ని మంచి బ్యాక్టీరియాలను కలిగి ఉంటాయి. ఇవి మనల్ని వ్యాధుల నుంచి కాపాడతాయి. చేతులతో భోజనం చేయడం చాలా మందికి ఆచారం. ఇది కుటుంబం కలిసి తినడం సామాజిక కోణాన్ని మెరుగుపరుస్తుంది.



# పుచ్చకాయ గింజల లాభాలు......




వేసవి వచ్చిందంటే ఇళ్లల్లో పుచ్చకాయలు కనిపిస్తుంటాయి. వేసవిలో హైడ్రేటెడ్‌గా ఉండేందుకు పుచ్చకాయలు తినడం మంచి అలవాటు. అయితే కేవలం కాయలు మాత్రమే కాదు, వాటి విత్తనాలతో కూడా బోలెడు బెనిఫిట్స్ ఉన్నాయని మీకు తెలుసా? పుచ్చకాయ గింజల్ని పారవేసేముందు ఈ విషయాలు తెలుసుకోండి. పుచ్చకాయ తిని వాటి గింజలు పారవేస్తున్నట్టయితే మీరు చాలా బెనిఫిట్స్ మిస్సవుతున్నట్టే. ఎందుకంటే పుచ్చకాయ గింజల్లో ఎన్నో పోషకాలు దాగున్నాయి. అవేంటంటే..పుచ్చకాయ గింజల్లో ఐరన్, మెగ్నీషియం, జింక్ వంటి మినరల్స్‌తో పాటు పాలీ అన్‌శాచురేటెడ్, మోనో అన్‌శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్‌లు కూడా ఉంటాయి. ఇవి చాలా అరుదుగా లభించే ఆరోగ్యకరమైన కొవ్వులు. పుచ్చకాయ గింజల్లో ఉండే మెగ్నీషియం రక్తంలో షుగర్ లెవల్స్‌ను కంట్రోల్‌లో ఉంచుతాయి. పైగా ఇందులో ఉండే క్యాలరీలు కూడా తక్కువే. కాబట్టి డయాబెటిస్ ఉన్నవాళ్లకు పుచ్చగింజలు ఎంతో మేలు చేస్తాయి. పుచ్చకాయ గింజల్లో ఉండే ఫ్యాటీ యాసిడ్స్ మెదడు ఆరోగ్యానికి మంచిది. అలాగే ఇవి చర్మాన్ని కూడా తేమగా, మృదువుగా ఉంచడంతో సాయపడతాయి.

# పరగడుపున నిమ్మరసం తాగితే..!



మనలో చాలామందికి ఉదయం నిద్ర లేవగానే పరగడుపున నిమ్మరసం నీళ్లు తాగడం అలవాటు. నిమ్మరసం నీళ్లు తాగడం వల్ల మంచి మంచి ప్రయోజనాలు ఉన్నాయని, రోగ నిరోధక శక్తి మెరుగుపడుతుందని చాలామంది ఉదయాన్నే ఈ నీటిని తాగుతూ ఉంటారు. మరి ఉదయాన్నే తాగితే ఏం జరుగుతుంది? వాటి వల్ల ఎలాంటి ఫలితాలు కలుగుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. ఉదయం పూట నిమ్మరసం నీళ్లు తాగితే శరీరంలోని వ్యర్థాలను, టాక్సిన్స్ ను తొలగిస్తాయి. గ్యాస్ట్రిక్ జ్యూస్‌ల ఉత్పత్తిని ప్రేరేపించి మెరుగైన జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. నిమ్మకాయలతో పాటు ఇతర సిట్రస్ పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇన్ఫెక్షన్ల నుంచి విటమిన్ సి శరీరాన్ని రక్షిస్తుంది. శరీరంలో హార్మోన్ల ఉత్పత్తిని, ఐరన్ శోషణ, కొల్లాజెన్ సంశ్లేషణ లో ఉపయోగపడుతుంది. ఆరోగ్యంగా, యాక్టివ్‌గా ఉండటానికి రోజంతా హైడ్రేట్‌గా ఉండాలంటే ప్రతి రోజూ తగినంత నీరు తాగాలి. నిమ్మకాయలో ఉండే పెక్టిన్ ఫైబర్ తినాలి అనే కోరికలను తగ్గిస్తుంది. దీనివల్ల సులువుగా బరువు తగ్గుతారు. నిమ్మరసం నీరు ఆకలిని అణచివేస్తుంది. డిటాక్స్ వాటర్ జీవక్రియను మెరుగుపరుస్తుంది. నిమ్మరసం నీళ్లు మూత్రపిండాల్లో రాళ్లను కరిగిస్తాయి. కిడ్నీలో ఖనిజాలు చేరడం వల్ల మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడతాయి. కాల్షియం ఆక్సలేట్ తో ఏర్పడే వీటికి సిట్రేట్‌ను దివ్యమైన ఔషధంలా పనిచేస్తుంది. శరీరం pH స్థాయిలను సమతుల్యం చేయడానికి, ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు తోడ్పడుతుంది. అలాగే నిమ్మరసంలో ఉండే సహజ యాంటీ బాక్టీరియల్ లక్షణాలు శ్వాసను తాజాగా చేయడానికి, బ్యాక్టీరియా వల్ల వచ్చే నోటి దుర్వాసనను అరికడతాయి. నిమ్మరసంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు ఫ్రీ రాడికల్స్ ఏర్పాటును అడ్డుకుంటాయి. దీనివల్ల హృదయ సంబంధ వ్యాధుల ముప్పు తగ్గుతుంది. కాబట్టి ఉదయాన్నే పరగడుపున నిమ్మకాయ నీళ్లు తాగడం మంచిదే. ఇలా తాగడం వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు కూడా కలుగుతాయి. అలా అని ఎక్కువగా తాగితే మాత్రం పలు రకాల సమస్యలు తప్పవు.

# సమ్మర్‌లో ఆ జాగ్రత్తలు మస్ట్......!




ఉదయం 8 గంటలు భానుడి భగభగలతో జనం ఇబ్బందులు పడుతున్నారు. దైనందిన జీవితంలో వృత్తి ఉద్యోగాలపై బయటకు వెళ్లకుండా ఉండలేని పరిస్థితి. ఇటువంటి పరిస్థితులలో కనీస జాగ్రత్తలే మంచిదన్నారు. ఆరోగ్యపరంగా చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటే వేసవిని జయించవచ్చు. ఎండలో ఎక్కువగా తిరగటం వల్ల డిహైడ్రేషన్కు గురయ్యే ప్రమాదం ఉంది. భానుడి ప్రతాపం తీవ్రస్థాయిలో ఉన్న ప్రస్తుత తరుణంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య బయటకు వెళితే డిహైడ్రేషన్కు గురయ్యే అవకాశం ఉంది. డిహైటేషన్కు గురైన వ్యక్తి ఒంట్లోని నీరు, లవణాలు తగ్గిపోయి నిస్సత్తువ ఆవహిస్తుంది. దీంతో ఆ వ్యక్తిలో చిరాకు, ఆందోళన ఏర్పడి ఏమీ చేయలేని పరిస్థితికి చేరుకుంటాడు. తలనొప్పి వేగంగా అలసిపోవడం లాంటి ఇబ్బందులు ఉంటాయి. వేసవిలో నాలుక పిడచ కట్టుకుపోతుంది. ఇటువంటి సమయంలో ఏది పడితే అది వినడం, తాగటం మంచిది కాదు. కలుషిత ఆహారము నీరు వల్ల అతిసార బారిన పడే అవకాశం ఉంది. ఒంట్లో శక్తి పూర్తిగా తగ్గిపోయి నీరసం ఏర్పడుతుంది. వ్యక్తి త్వరగా కోలుకునేందుకు కాచి చల్లార్చిన మంచి నీటిని తాగించాలి. ఈ కాలంలో వచ్చిన జ్వరం శరీరంలోని ఉష్ణోగ్రతను తీవ్ర స్థాయిలో పెంచి నిశ్శత్తువ ఆవహించేలా చేస్తుంది. ముఖ్యంగా చిన్నపిల్లల్లో జ్వరాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలి. ఎక్కడపడితే అక్కడ కూలింగ్ వాటర్, చల్లని పానీయాలు, మజ్జిగ తాగటం వల్ల జలుబు చేసే అవకాశం ఉంది. జలుబు చేసిన వ్యక్తికి ముక్కు వెంట విపరీతంగా నీరు కారణం, తలనొప్పి వస్తుంది. ప్రధానంగా ఈ కాలంలో అమ్మవార్లు, చంప గడ్డలు, దవడల సమస్య తీవ్రంగా ఉంటుంది. వీటిని గోకటం వల్ల పుండ్లు ఏర్పడి మరింత ఇబ్బంది అవుతుంది. ఈ కాలంలో రోజు రెండుసార్లు స్నానం చేయడం ద్వారా ఎప్పటికప్పుడు శుభ్రత ఏర్పడి ఇటువంటి సమస్యలను వీలైనంత వరకు దూరం చేసుకోవచ్చు. దీంతో ఆ వ్యక్తిలో చిరాకు, ఆందోళన ఏర్పడి ఏమీ చేయలేని పరిస్థితికి చేరుకుంటాడు. తలనొప్పి వేగంగా అలసిపోవడం లాంటి ఇబ్బందులు ఉంటాయి.వేసవిలో నాలుక పిడచ కట్టుకుపోతుంది. ఇటువంటి సమయంలో ఏది పడితే అది వినడం, తాగటం మంచిది కాదు. కలుషిత ఆహారము నీరు వల్ల అతిసార బారిన పడే అవకాశం ఉంది.

# పాల ఉత్పత్తులు ఎంత మోతాదులో తీసుకుంటే హెల్త్‌కి మంచిది?




పాలు, పాల ఉత్పత్తులు ఆరోగ్యానికి చాలా విధాలుగా మేలు చేస్తాయి. ముఖ్యంగా ఇవి ఎముకల ఆరోగ్యాన్ని నిర్మించడంలో సహాయపడతాయి. పాల ఉత్పత్తులలో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. అవి బలమైన, దృఢమైన ఎముకలను నిర్మించడంలో సహాయపడతాయి. పండ్లు, కూరగాయలతో పాటు పాల ఉత్పత్తులను కూడా తప్పరిసరిగా తీసుకోవాలి. ఇది అధిక రక్తపోటు ప్రమాదాన్ని నివారిస్తుంది. పేగుల ఆరోగ్యానికి ప్రోబయోటిక్స్ అవసరం. పాల నుంచి జున్ను, పెరుగు, లస్సీ, నెయ్యి, వెన్న వంటి ఆహారాన్ని తయారు చేస్తారు. కానీ నెయ్యి-వెన్న, జున్ను ఎక్కువగా తినడం ప్రమాదకరం. అందుకే ఏ ఆహారం తింటే ఎలాంటి లాభాలు పొందుతారో తెలుసుకోవాలి. అప్పుడే ఆహారం సమతుల్యంగా ఉంటుంది. పుల్లని పెరుగు నుంచి పోషకాహారం లభిస్తుంది. పుల్లటి పెరుగు తింటే జీర్ణ సమస్యలు దూరమవుతాయి. వెన్నలో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. సంతృప్త కొవ్వులు కూడా ఉంటాయి. కాబట్టి తక్కువ మోతాదులో వెన్న తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. వంటల్లో వెన్న, నెయ్యిని ఉపయోగించవచ్చు. నెయ్యి ఆరోగ్యానికి మేలు చేస్తుంది. నెయ్యిలో అధిక మొత్తంలో కొవ్వు, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. నెయ్యిలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు గుండెకు మేలు చేస్తాయి. ఆహారంలో కొద్ది మొత్తంలో నెయ్యి తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగవు. క్యాల్షియం, ప్రొటీన్‌లతో పాటు పెరుగులో ప్రోబయోటిక్స్ అధికంగా ఉంటాయి.

# మీ ముఖం చూసి.. మీ కిడ్నీ పాడైందో లేదో చెప్పొచ్చు



కిడ్నీలు మన శరీరంలో ఒక ముఖ్యమైన అవయవం. ఇది రోజంతా నాన్‌స్టాప్‌గా పని చేస్తుంది. మూత్రపిండాలు మన శరీరం నుండి విషాన్ని ఫిల్టర్ చేయడానికి, వాటిని మూత్రం ద్వారా విసర్జించడానికి బాధ్యత వహిస్తాయి. కిడ్నీలు శుభ్రపరిచే పనిని చేస్తాయి. అవి సమస్యలకు గురయ్యే అవకాశం ఎక్కువ. ఒక వ్యక్తి తగినంత నీరు తాగకపోతే కిడ్నీ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఇది కాకుండా అధిక రక్తపోటు, అధిక రక్తంలో చక్కెర స్థాయిలు, ఊబకాయం, ధూమపానం కూడా మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదాన్ని పెంచుతాయి. మూత్రపిండాల వ్యాధులు అభివృద్ధి చెందుతాయి. అలాగే కుటుంబంలో ఎవరికైనా కిడ్నీ సమస్యలు ఉంటే వారికి కూడా కిడ్నీ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. కిడ్నీలకు సంబంధించిన సమస్య ఉంటే వాటి గురించి మనకు తెలియజేయడానికి మన శరీరం కొన్ని సంకేతాలను చూపుతుంది. కిడ్నీలో ఏదైనా సమస్య ఉంటే ముఖంలో, కళ్లలో లక్షణాలు కనిపిస్తాయి. కిడ్నీ వ్యాధి ఉంటే ముఖం, కళ్లలో ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయో చూద్దాం. కిడ్నీ సమస్యలకు కంటి వాపు మొదటి సంకేతం. మూత్రపిండాలు అదనపు ద్రవాలను సరిగ్గా బయటకు పంపలేనప్పుడు లేదా కష్టపడనప్పుడు, ఆ ద్రవాలు కళ్ళ చుట్టూ పేరుకుపోతాయి. వాపునకు కారణమవుతాయి. అటువంటి కంటి వాపు నిరంతరంగా లేదా తీవ్రంగా ఉంటే, వెంటనే వైద్యుడిని సంప్రదించండి. అసహ్యకరమైన నల్లటి వలయాలు, తగినంత నిద్ర లేకపోవడం వల్ల మాత్రమే కాకుండా మూత్రపిండాల సమస్యల వల్ల కూడా సంభవించవచ్చు. ఈ సందర్భంలో, మీరు వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. మీ చర్మం రంగు సాధారణం కంటే పసుపు లేదా లేతగా కనిపిస్తే, మీ కిడ్నీలతో సమస్య ఉండవచ్చు. కిడ్నీలు సరిగా పని చేయనప్పుడు, శరీరంలో టాక్సిన్స్ పేరుకుపోయినప్పుడుచర్మపు రంగు మారుతుంది. మీరు మీ చర్మం రంగులో ఏదైనా అసాధారణ మార్పును గమనించినట్లయితే, వెంటనే మీ వైద్యుడిని సంప్రదించండి.

# రాజమౌళి కోసం.. మహేష్ లుక్ ఇదేనా?



ఈ ఫోటోల్లో మహేష్ నయా మెకోవర్ అదిరిపోయింది. లాంగ్ హెయిర్, బియర్డ్ లుక్ లో మహేష్ ని చూసిన ఫ్యాన్స్ హాలీవుడ్ హీరోలా ఉన్నారంటూ కామెంట్స్ చేస్తున్నారు. సూపర్ స్టార్ మహేష్ బాబు మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబో లో తెరకెక్కిన 'గుంటూరు కారం' సినిమా సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. మొదటిరోజే ఈ సినిమాకు కొంచెం మిక్స్డ్ టాక్ రావడంలో కలెక్షన్ల మీద ప్రభావం పడుతుందని ట్రేడ్ వర్గాలు భావించాయి. కానీ ఆ అంచనాలను తలకిందులు చేస్తూ బాక్సాఫీస్ వద్ద దూసుకుపోయింది. ఇప్పటివరకు ఏకంగా రూ.250 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. దీంతో ఫ్యాన్స్ ఓ వైపు సంబరాలు చేసుకుం టుంటే మహేష్ బాబు మాత్రం రాజమౌళి సినిమా కోసం వర్క్ షాప్ స్టార్ట్ చేసాడు. ఈ క్రమంలోనే ప్రజెక్టు కోసం సరికొత్తగా మేకోవర్ అవ్వడానికి రీసెంట్ గానే జర్మనీ వెళ్ళాడు జక్కన్న పాన్ వరల్డ్ మూవీ ప్రీప్రొడక్షన్స్ వర్క్‌లో భాగంగా స్టంట్స్‌లో..యాక్షన్‌లో.. ఫారెన్లో ట్రైనింగ్ తీసుకున్నాడు మహేష్ బాబు. ఆ క్రేజీ సీక్వెల్స్ పోయినట్లే.. రీసెంట్‌గా ట్రెక్కింగ్ చేస్తూ.. కొన్ని ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకున్న విషయం తెలిసిందే. ఇక జర్మనీ ట్రిప్ కంప్లీట్ చేసుకున్న మహేష్ బాబు తాజాగా హైదరాబాద్ తిరిగి వచ్చేసాడు. ఎయిర్ పోర్ట్ నుంచి బయటకు వస్తుండగా మహేష్ ఫోటోలు సోషల్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోల్లో మహేష్ నయా మెకోవర్ అదిరిపోయింది. లాంగ్ హెయిర్, బియర్డ్ లుక్ లో మహేష్ ని చూసిన ఫ్యాన్స్ హాలీవుడ్ హీరోలా ఉన్నారంటూ కామెంట్స్ చేస్తున్నారు. బహుశా ఇదే లుక్ తో రాజమౌళి సినిమాలో మహేష్ కనిపించే ఛాన్స్ ఉంది. తలకి క్యాప్, కూలింగ్ గ్లాస్ పెట్టుకొని బ్రౌన్ కలర్ జాకెట్ లో కనిపించిన మహేష్ లేటెస్ట్ స్టైలిష్ లుక్స్ ఫ్యాన్స్ లో మరింత జోష్ నింపింది. ఆఫ్రికన్ అడవుల్లో ఇండియన్ ఇండియానా జోన్స్ రేంజ్ సినిమా ని మహేష్ తో రాజమౌళి ప్లాన్ చేస్తున్నాడు. ఇందుకోసం సుమారు 1000 కోట్లకు పైగా భారీ బడ్జెట్ ని కేటాయిస్తున్నట్లు తెలుస్తోంది సీనియర్ నిర్మాత కె.ఎల్ నారాయణ ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ లో ఉగాది సందర్భంగా ఈ ప్రాజెక్టుని అఫీషియల్ గా లాంచ్ చేయబోతున్నట్లు తెలుస్తోంది.

# కోడి రామ్మూర్తి బయోపిక్‌లో చరణ్..



క్రీడా నేపథ్యంలో చరణ్- బుచ్చి బాబు సినిమా రూపొందుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ సినిమాలో హీరో ఉత్తరాంధ్ర యువకుడిగా కనిపించనున్నారని సమాచారం. మెగా పవర్ స్టార్ రామ్చరణ్ ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో గేమ్ ఛేంజర్ మూవీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా స్టార్ట్ అయ్యి చాలా నెలలు అయినా.. ఇంకా రిలీజ్ డేట్ ఖరారు కాలేదు. వచ్చే నెలలో విడుదల తేదీని మేకర్స్ ప్రకటించనున్న ట్లు సమాచారం. ఆర్ఆర్ఆర్ తర్వాత చరణ్ నటిస్తున్న సినిమా కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ మూవీ సెట్స్ పై ఉండగానే.. చరణ్ ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గేమ్ ఛేంజర్ చిత్రీకరణ పూర్తి అయిన తర్వాత సెట్స్ మీదకు బుచ్చిబాబు- చరణ్ ప్రాజెక్ట్ ను తీసుకెళ్లాలని ప్లాన్ చేస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించి 400 మంది నటీనటులు కావాలని ఒక క్యాస్టింగ్ కాల్ రిలీజ్ చేశారు మేకర్స్. ఫిబ్రవరి 5వ తేదీ నుంచి 17వ తేదీ వరకు విజయనగరం, సాలూరు, శ్రీకాకుళం, విశాఖపట్నంలో ఆడిషన్స్ పెడుతున్నామని, నటించాలని ఆసక్తి ఉన్న వారందరూ రావాలని పేర్కొన్నారు. క్రీడా నేపథ్యంలో చరణ్- బుచ్చి బాబు సినిమా రూపొందుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ సినిమాలో హీరో ఉత్తరాంధ్ర యువకుడిగా కనిపించనున్నారని సమాచారం. అందుకే చరణ్ ఆ ప్రాంతం యాస మీద దృష్టి సారించారట. నేర్చుకునే పనిలో ఉన్నారట. అయితే ఉత్తరాంధ్రకు చెందిన మల్లయోధుడు కోడి రామ్మూర్తి నాయుడు జీవిత కథ ఆధారంగా బుచ్చిబాబు స్టోరీ సిద్ధం చేశారని, తెరపై రామ్మూర్తి పాత్రలో రామ్ చరణ్ కనిపిస్తారని టాక్ వినిపిస్తోంది. మరి కోడి రామ్మూర్తి ఎవరంటే? శ్రీకాకుళం జిల్లాలో పుట్టిన కోడి రామూర్తి నాయుడు కలియుగ భీముడిగా పేరు సంపాదించుకున్నారు. చిన్నవయసులోనే మల్లయుద్ధంలో ఆరితేరేస్థాయికి చేరుకున్నారు. 21 సంవత్సరాల వయసులోనే ఛాతిపై ఒకటిన్నర టన్నుల బండరాయిని మోసి అందరినీ ఆశ్చర్యపరిచారు. నెమ్మది నెమ్మదిగా 3 టన్నుల భారాన్ని మోయగలిగే స్థాయికి చేరుకున్నారు. శరీరానికి ఐరెన్ చైన్లు బిగించుకుని, ఊపిరి బిగించి వాటిని ముక్కముక్కలు చేయడంలో రామ్మూర్తి నాయుడును మించిన వారు లేరనే చెప్పొచ్చు. రెండు కార్లను రెండు భుజాలకు ఇనుప గొలుసులతో కట్టించుకుని వాటిని శరవేగంగా నడపమనేవారు. కానీ, కార్లు కదిలేవి కాదు. చూసేందుకే భయమనిపించే ఏనుగును తన ఛాతీపై ఎక్కించుకుని కొన్ని నిమిషాల పాటు అలానే ఉంచి ఆ బరువంతా మోసేవారు. ఇలా రామ్మూర్తి తన విన్యాసాలతో ప్రజలను ఎంతో ఆకట్టుకున్నారు. కోడి రామ్మూర్తి నాయుడు తెలుగు రాష్ట్రంలో ఎంతో మందికి వ్యాయామంతోపాటు బాడీ బిల్డింగ్ లో శిక్షణ ఇచ్చారు. ఇప్పటికీ చాలా జిల్లాల్లో ఏర్పాటు చేసిన వ్యాయామశాలలకు ఆయన పేరునే పెట్టారు. ఇక రామ్ చరణ్16.. కోడి రామ్మూర్తి నాయుడు బయోపిక్ గా తెరకెక్కుతుందో లేదో అన్న విషయం మీద ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతోంది.

# ఆ క్రేజీ సీక్వెల్స్ పోయినట్లే..

మురుగదాస్ తుపాకీ 2, లోకేష్ లియో 2, విక్రమ్ 2, రాయప్పన్ సీక్వెల్, విజయ్, షారుఖ్ కాంబోలో చేయాల్సిన మూవీ, అలాగే వెట్రిమారన్ తో ఒక సినిమా ఉంది. ఇళయదళపతి విజయ్ ప్రస్తుతం వెంకట్ ప్రభు దర్శకత్వంలో సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటిస్తోంది. ఈ ఏడాది అఖరులో ప్రేక్షకుల ముందుకి వచ్చే అవకాశం అయితే ఉంది. ఇదిలా ఉంటే తమిళ్ రాజకీయాలలో చాలా కాలంగా విజయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. రాజకీయాలలోకి వస్తాడనే ప్రచారం నడిచింది. ఈ కారణంగా విజయ్ తమిళనాడులో ప్రధాన పార్టీలకి టార్గెట్ అయ్యాడు కూడా. రీసెంట్ గా ఎవరూ ఊహించని విధంగా విజయ్ రాజకీయాలలోకి రాబోతున్నట్లు ప్రకటించడమే కాకుండా పార్టీ పేరు కూడా ఎనౌన్స్ చేశాడు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో తన పార్టీ పోటీ పడటం లేదని, 2027 ఎన్నికలలో అసెంబ్లీ బరిలోకి దిగుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం తమిళనాడులో డీఎంకే పార్టీ అధికారంలో ఉంది. ప్రతిపక్షంగా ఉన్న అన్నా డీఎంకే పార్టీని బలంగా నడిపించే నాయకత్వం లేదు. ఒక రాజకీయ శూన్యత అయితే ఉంది. దీనిని బీజేపీ అనుకూలంగా మార్చుకునే ప్రయత్నంలో ఉంది. ఇలాంటి సమయంలో ప్రజలలో మాస్ ఇమేజ్ తో పాటు సామాజిక సేవా కార్యక్రమాలతో మంచి పాపులారిటీ సొంతం చేసుకున్న విజయ్ పార్టీ పెట్టడం కచ్చితంగా సెన్సేషన్ అని చెప్పాలి. పూర్తిస్థాయిలో రాజకీయాలలోకి వెళ్లిన తర్వాత సినిమాలు చేయనని విజయ్ ప్రకటించారు. అదే జరిగితే వెంకట్ ప్రభుతో చేస్తోన్న మూవీనే విజయ్ చివరి చిత్రం అయ్యే అవకాశం ఉంది. విజయ్ తో సినిమాలు చేయడానికి చాలా మంది దర్శకులు సిద్ధంగా ఉన్నారు. అలాగే సీక్వెల్స్ కూడా రెడీ అవుతున్నాయి. మురుగదాస్ తుపాకీ 2, లోకేష్ లియో 2, విక్రమ్ 2, రాయప్పన్ సీక్వెల్, విజయ్, షారుఖ్ కాంబోలో చేయాల్సిన మూవీ, అలాగే వెట్రిమారన్ తో ఒక సినిమా ఉంది. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో ఒక మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. విజయ్ రాజకీయాలలోకి వెళ్తే ఈ ఏడు సినిమాల భవిష్యత్తు ఏంటి అనేది పెద్ద ప్రశ్నగా మారింది. విజయ్ కోసం సిద్ధం చేసుకున్న సీక్వెల్స్ పరిస్థితి ఏంటి అనేది ఇప్పుడు ఆ దర్శకులు ఆలోచించుకుంటున్నారు. వీళ్ళలో ఎవరైన వెళ్లి విజయ్ తో కలిసి సినిమాలకి ఫుల్ స్టాప్ పెట్టాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రిక్వస్ట్ చేసే అవకాశం ఉందా అనేది చూడాలి. అలాగే అభిమానులు కూడా విజయ్ సినిమాలు మానేస్తా అంటే ఒప్పుకోకపోవచ్చు. మరి విజయ్ సినిమా కెరియర్ ప్లానింగ్ ఎలా ఉంటుందనేది భవిష్యత్తులో ఒక స్పష్టత వచ్చే ఛాన్స్ ఉంది.







# ఏడేళ్లకు పైగా బంధం రా..

నాని, కీర్తి సురేష్ కాంబోలో ఇప్పటికే రెండు చిత్రాలు వచ్చాయి. అవి బ్లాక్ బస్టర్ హిట్లుగా నిలిచాయి. నేను లోకల్ సినిమాతో వీరి కాంబో హిట్ కొట్టగా.. దసరాతో బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టేసింది. నేను లోకల్ వచ్చి ఏడేళ్లు అవుతున్న సందర్భంగా నాని, కీర్తి సురేష్‌లు ఫన్నీగా స్పందించారు. నాని కీర్తి సురేష్ ఆన్ స్క్రీన్ కంటే.. ఆఫ్ స్క్రీన్‌లోనే ఎక్కువగా అందరినీ ఆకట్టుకుంటుంది. దసరా ప్రమోషన్స్‌లో నాని, కీర్తి సురేష్‌లు ఎంత అల్లరి చేశారో అందరికీ తెలిసిందే. ఇక సెట్స్‌లోనూ ఈ ఇద్దరూ బాగానే సందడి చేశారు. సెట్స్‌లో షాట్స్‌కి గ్యాప్ వస్తే ఆటలు ఆడుకున్నారు. ఆ వీడియోలు సైతం నెట్టింట్లో బాగానే వైరల్ అయ్యాయి. నేను లోకల్ సినిమాతో నాని, కీర్తి సురేష్‌ల మధ్య మరింతగా క్లోజ్‌నెస్ పెరిగింది. వారి బంధం అలా కొనసాగుతూ వచ్చింది. మహా నటి సినిమాకు సైతం కీర్తి సురేష్‌ను నానియే సజెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కీర్తి సురేష్ నానిలు కలిసి నటించిన నేను లోకల్ సినిమా ఇప్పుడు మళ్లీ చర్చలకు వచ్చింది. ఈ మూవీ విడుదలై ఏడేళ్లు అవుతుందని గుర్తు చేశారు. ఈ మేరకు కీర్తి సురేష్ పోస్ట్.. దాని మీద నాని రియాక్షన్ వైరల్ అవుతోంది. మనం కలిసి ఏడేళ్లకు పైగానే అవుతోంది రా అంటూ నాని గురించి కీర్తి సురేష్ కామెంట్ చేసింది. ఈ ఏడేళ్లు అలా చిటికెల్ గడిచినట్టుగా అనిపిస్తోంది.. ఇంకా మనం కలిసి ఎన్నో సినిమాలు చేయాలన్నట్టుగా కీర్తి సురేష్ పోస్ట్ వేసింది. నిన్ను ఇంకా ఇంకా డిస్టర్బ్ చేస్తూనే ఉంటా అన్నట్టుగా నాని కౌంటర్లు వేశాడు. ఇక ఈ ఇద్దరి ఫన్నీ ముచ్చట్లు ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. నాని ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. సరిపోదా శనివారం అంటూ మరో ప్రయోగం చేస్తున్నారు. వివేక్ ఆత్రేయ, శ్రీకాంత్ ఓదెల అంటూ ఇలా మళ్లీ మళ్లీ తాను పని చేసిన దర్శకులతోనే సినిమాలు చేస్తున్నాడు నాని. దసరా, హాయ్ నాన్న అంటూ గత ఏడాది రెండు జానర్లతో బ్లాక్ బస్టర్ హిట్లు కొట్టేసిన సంగతి తెలిసిందే.

పాయల్ రాజ్‌పుత్ తన కెరీర్‌ను ఎలా మొదలు పెట్టిందో అందరికీ తెలిసిందే.మోడలింగ్, బాలీవుడ్ సీరియల్స్, పంజాబీ ఇండస్ట్రీలో సినిమాలు, ఆర్ఎక్స్ 100తో తెలుగులోకి వచ్చి ఇక్కడే స్థిరపడిపోయిన సంగతి తెలిసిందే. ఆర్ఎక్స్ 100తో పాయల్ రాజ్‌పుత్ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. అప్పటి వరకు పాయల్ రాజ్‌పుత్ చిన్నా చితకా చిత్రాలు, ప్రాజెక్టులు, సీరియల్స్ చేస్తూ ఎలాంటి గుర్తింపు లేకుండా నార్త్‌లో ఉండిపోయింది. కానీ ఆర్ఎక్స్ 100 సినిమాతో పాయల్ కెరీర్ మారిపోయింది. తెలుగులో ఒక్కసారిగా హాట్ హీరోయిన్‌గా ఇండస్ట్రీలో చర్చలకు దారి తీసింది. పాయల్ రాజ్‌పుత్ పేరు ఒక్కసారిగా మార్మోగిపోయింది. ఆర్ఎక్స్ 100 సినిమా పేరు మీద పాయల్‌కు లెక్కలేనంత క్రేజ్,డిమాండ్ ఏర్పడింది. ఆ తరువాత కుప్పలు తెప్పలుగా ఆఫర్లు వచ్చాయి. అయితే పాయల్ ఎన్ని సినిమాలు చేసినా కూడా మళ్లీ ఆర్ఎక్స్ 100 రేంజ్ బ్లాక్ బస్టర్ కొట్టలేదు. గత ఏడాది మంగళవారం అంటూ అజయ్ భూపతి దర్శకత్వంలో వచ్చిన సినిమాతో పాయల్ హిట్టు కొట్టింది. ఆర్ఎక్స్ 100 రేంజ్‌లో మంగళవారం హిట్టు కాకపోయినా కూడా పాయల్‌ను మళ్లీ నిలబెట్టేసింది. గ్లామర్ పరంగా, యాక్షన్ పరంగా పాయల్ రాజ్‌పుత్ మళ్లీ తన సత్తాను చాటుకుంది. అయితే పాయల్ తాజాగా తన తొలి అడుగుల్ని గుర్తు చేసుకుంది.

పాయల్ తన మొదటి ఫోటో షూట్ అనుభవాల్ని పంచుకుంది. 21 ఏళ్లకు ఈ మోడలింగ్ రంగంలోకి వచ్చిందట.. అప్పుడే తన తొలి ఫోటో షూట్ చేయించుకుందట. ఇదే ఆ ఫోటో అని కూడా నాటి లుక్‌ను షేర్ చేసింది. ఓ

# 21 ఏళ్లకే మొదలుపెట్టా..

మ్యాగజైన్ కోసం మొదటి సారిగా ఫోటో షూట్ చేయించుకుందట. ఢిల్లీలో ఈ ఫోటో షూట్ జరిగిందట. తరువాత పాయల్ ముంబైకి షిఫ్ట్ అయిందట. ఆ తరువాత సీరియల్స్‌తో టెలివిజన్ రంగంలో కెరీర్ ప్రారంభించిందట. ఈ మేరకు పాయల్ తన ఇన్ స్టా స్టోరీలో పెట్టిన ఈ మ్యాటర్ ఇప్పుడు వైరల్ అవుతోంది. అలా బాలీవుడ్‌లో సీరియల్స్, పంజాబీ ఇండస్ట్రీలో సినిమాలు, తెలుగులో ఇప్పుడు క్రేజీ హీరోయిన్‌గా అవకా శాలు అందుకోవడం.. ఈ జర్నీ గురించి అందరికీ తెలిసిందే.



# శివన్నతో ఏం ప్రయోగం చేస్తాడో

కన్నడలో గత ఏడాది వచ్చిన సప్త సాగరాలు దాటి మూవీ అక్కడ మంచి విజయాన్ని నమోదు చేసింది. దీంతో ఇతర భాషల్లోకి ఈ చిత్రాన్ని డబ్ చేశారు. కానీ అంతగా ఎక్కలేదు. తెలుగులో ఈ చిత్రం అంతగా విజయాన్ని సాధించలేకపోయింది. కన్నడలో ప్రస్తుతం ఎలాంటి చిత్రాలు వస్తున్నాయో.. ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తున్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. గత ఏడాది అక్కడ "సప్త సాగరాలు దాటి" సైడ్ ఏ, సైడ్ బీ అంటూ బ్లాక్ బస్టర్‌లు అందుకున్నాడు దర్శకుడు హేమంత్ ఎం రావు. అక్కడ బ్లాక్ బస్టర్ హిట్ అవ్వడంతో ఈ చిత్రాలను తెలుగులోకి కూడా తీసుకొచ్చారు. కానీ అక్కడ ఆదరణ వచ్చినట్టుగా ఇక్కడ అంతగా రాలేదు. రక్షిత్ శెట్టి, రుక్మిణిల నటనకు మాత్రం ఇక్కడి ప్రేక్షకులు ఫిదా అయ్యారు.

ఇప్పుడు ఆ సినిమా దర్శకుడు తన తదుపరి ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేశాడు. కన్నడ శివన్న హీరోగా హేమంత్ ఎం రావు తన నెక్స్ట్ ప్రాజెక్ట్ చేయబోతున్నాడు. ఇక ఈ సినిమా ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్నట్లు సమాచారం. జె.ఫిల్మ్స్ పతాకంపై వైశాక్ జె గౌడ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సప్త సాగరాలు దాటి అంటూ ఫుల్ ఎమోషనల్ స్టోరీని చేసిన దర్శకుడు ఈ సారి మాస్ యాక్షన్ చేయబోతోన్నట్టుగా తెలుస్తోంది. కవలుదారి, భీమ సేన నల మహారాజు, సప్త సాగరాలు దాటి లాంటి డిఫరెంట్ జానర్‌లు తర్వాత హేమంత్ ఎం రావు యాక్షన్ సినిమా చేయనుండడంతో ఈ సినిమాపై మరింత హైప్ పెరిగింది. ఇక ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు చిత్రయూనిట్ తెలిపింది. తాను నిర్మిస్తున్న మొదటి సినిమానే శివరాజ్ కుమార్ లాంటి స్టార్ తో చేయడం సంతోషంగా ఉందని.



# 25 కోట్లు ?



హీరో రామ్ ప్రస్తుతం డబుల్ ఇస్మార్ట్ షూటింగ్‌లో ఉన్నాడు. పూరి జగన్నాథ్ లైగర్ ఫ్లాప్ తరువాత రామ్‌తో మళ్లీ ఇలా ఓ ప్రాజెక్ట్‌ను స్టార్ట్ చేశాడు. అసలు రామ్, పూరి ఇద్దరూ కూడా ఒకే లైన్‌లో ఉన్నారు. సరైన హిట్టు కొట్టేందుకు నానా కష్టాలు పడుతున్నారు. సినిమాలు బాగా ఆడి.. థియేట్రికల్ రన్ పరంగా డిస్ట్రిబ్యూటర్లకు లాభాలు తెచ్చి పెడుతుంటే ఆ ప్రాజెక్టులు బాగానే సేఫ్ అయినట్టు. నిర్మాతలు కూడా అలాంటి సినిమాలు తీసేందుకు ఇష్టపడుతుంటారు. అసలే ఇప్పుడు భారీ బడ్జెట్ చిత్రాలు తీసి చేతులు కాల్చుకుంటున్నారు. కాంబినేషన్లు అంటూ వెంట తిరిగి చివరకు డిజాస్టర్లను తీస్తున్నారు. అదే కంటెంట్ మీద నమ్మి, తక్కువ బడ్జెట్‌లో ఎన్నో వండర్లు క్రియేట్ చేస్తున్నారు కొంత మంది. ఇక ఇప్పుడు హీరోల రెమ్యూనరేషన్‌ల మీద మళ్లీ చర్చలు జరుగుతున్నాయి. చిరంజీవి వరుసగా ఆచార్య, భోళా శంకర్ అంటూ డిజాస్టర్లు ఇచ్చాడు. ఈ క్రమంలో చిరంజీవి తన రెమ్యూనరేషన్ మీద చర్చలు జరిగాయి. కాస్త వెనక్కి తిరిగి ఇచ్చాడని చెబుతుంటారు. నిర్మాత అనిల్ సుంకర అయితే చిరంజీవికి ఇంకా కొంత బ్యాలెన్స్ ఉన్నా కూడా ఆయన వద్దని చెప్పారంటూ బహిరంగంగానే ప్రకటించేశారు. అలా సినిమా ఫ్లాపులు అయితే ఆదుకునే హీరోలున్నారు. హీరోలు తమ గత చిత్రాల ఫలితాలు, మార్కెట్ స్థాయి, బిజినెస్ లెక్కలను బేరీజు వేసుకుని రెమ్యూనరేషన్ తీసుకుంటే ఎవరికీ ఏ బాధ ఉండదు. కానీ హీరో రామ్ మాత్రం ఇప్పుడు కోట్ చేస్తున్న రెమ్యూనరేషన్ చూసి ఓ నిర్మాత భయపడిపోయాడట. ఓ ప్రాజెక్ట్ చేయాలని ప్రయత్నిస్తూ.. ఆ రేంజ్ రెమ్యూనరేషన్ ఇచ్చుకోలేమని వదిలేశాడట.

అసలే రామ్‌కు ఇప్పుడు సరైన హిట్టు లేదు. పైగా రొటీన్ సినిమాలు ఆడటం లేదు. ఇస్మార్ట్ శంకర్ తరువాత చేసిన చిత్రాలు అంతగా ఆకట్టుకోలేకపోయాయి. చిన్న చిత్రాలు వచ్చినవే వంద కోట్ల గ్రాస్‌ను కొడుతున్నాయి. కానీ రామ్ చిత్రం ఇంత వరకు ఈ రేంజ్ కలెక్షన్లను సాధించలేదు. చివరగా వచ్చిన స్కంద ఎంతగా ట్రోలింగ్‌కు గురైందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఈ సినిమా ట్రోలర్లకు స్టఫ్‌లా మారింది. బాలయ్య,నాగ్ వంటి వారు కూడా వారి వారి మార్కెట్లకు తగ్గ రెమ్యూనరేషన్ తీసుకుంటారని సమాచారం. పది నుంచి పదిహేను కోట్లు తీసుకుంటారని టాక్. చిరంజీవి, మహేష్ బాబు, ప్రభాస్, బన్నీ, రామ్ చరణ్, ఎన్టీఆర్, పవన్ కళ్యాణ్ ఇలా అందరూ కూడా యాభై నుంచి వంద కోట్ల వరకు తీసుకుంటున్నట్టుగా తెలుస్తోంది. రామ్ అయితే ఇప్పుడు ఏకంగా రూ. 25 కోట్లు అడిగేస్తున్నాడట. అందుకే ఓ పెద్ద నిర్మాత, ఓ కమర్షియల్ డైరెక్టర్‌తో సినిమా తీయాలని, అది కూడా రామ్‌తో అనే చర్చలు వచ్చినప్పుడు ఈ రెమ్యూనరేషన్ తెలిసి వద్దనుకున్నాడట.

# క్రెడిట్ కార్డు వాడుతున్నారా? కొత్త రూల్స్ వచ్చాయ్





సాధారణంగా ఖాతాదారుడి అనుమతితోనే కార్డును జారీ చేస్తారు. ఒకవేళ కస్టమర్ అనుమతి లేకుండా కార్డు వస్తే దానిని యాక్టివేట్ చేయకూడదు. ఉదాహరణకు ఓటీపీ నంబర్ల వంటి వాటిని చెప్పకూడదు. కార్డును యాక్టివేట్ చేయడానికి ఖాతాదారుడి నుంచి అనుమతి రాకపోతే సదరు బ్యాంకు లేదా సంస్థ ఆ ఖాతాదారుడికి ఎటువంటి ఖర్చు లేకుండా ధ్రువీకరణ కోరిన తేదీ నుంచి ఏడు పని దినాల్లో కార్డు ఖాతాను మూసివేయాలి. క్రెడిట్ కార్డు వినియోగం ఈ రోజుల్లో సర్వసాధారణమైంది. దాదాపు ప్రతి ఒక్కరూ వీటిని వినియోగిస్తున్నారు. ఒకప్పుడు పట్టణ ప్రజలకే పరిమితమైన ఈ కార్డులను ప్రస్తుతం గ్రామీణులు సైతం ఎక్కువగా వాడుతున్నారు. నేడు ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయి. ఉద్యోగం, వ్యాపారాలతో రాణిస్తున్నారు. టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. ఒకప్పుడు బ్యాంకు ఖాతా ఉంటే ఎంతో గొప్ప. ఇప్పుడు క్రెడిట్ కార్డు ఉండడం కూడా సర్వసాధారణం. క్రెడిట్ కార్డులను బ్యాంకులు, నాన్ ఫైనాన్షియల్ సంస్థలు మంజూరు చేస్తాయి. అయితే ఇటీవల రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్ బీఐ) క్రెడిట్ కార్డు నిబంధనలను సులభతరం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా కార్డుదారులకు మేలు చేకూరేలా నిబంధనలను సవరించింది. గతంలో మనం క్రెడిట్ కార్డు జారీ చేసే బ్యాంకులను ఎంపిక చేసుకునే అవకాశం మాత్రమే ఉండేవి. ఏ కంపెనీ క్రెడిట్ కార్డు కావాలో ఎంపిక చేసుకునే వీలు లేదు. ఆ బ్యాంకులు తమతో ఒప్పందం చేసుకున్న కంపెనీల కార్డులు అందించేవి. తాజా నిబంధనల ప్రకారం ఏ కంపెనీ కార్డు కావాలో మనమే నిర్ణయించుకోవచ్చు.

**7వ తేదీ నుంచి అమల్లోకి..**

రిజర్వ్ బ్యాంకు విడుదల చేసిన ఆదేశాలు 2024 మార్చి 7 నుంచి అమలులోకి వచ్చాయి. క్రెడిట్ కార్డులు జారీ చేసే అన్ని బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు ( ఎన్ఎఫ్ బీసీలు) ఆ నిబంధలను తప్పనిసరిగా పాటించాలి. క్రెడిట్ కార్డు బిల్లింగ్ సైకిల్ ప్రారంభ లేదా ముగింపు తేదీలను ఎంచుకునే అవకాశం కార్డుదారుడికి కల్పించారు. హెల్ప్‌లైన్, ఈ మెయిల్ ఐడీ, ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ (ఐవీఆర్), ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ అప్లికేషన్ తదితర వాటి ద్వారా కార్డుదారుడు ఈ సేవలను పొందవచ్చు. సాధారణంగా ఖాతాదారుడి అనుమతితోనే కార్డును జారీ చేస్తారు. ఒకవేళ కస్టమర్ అనుమతి లేకుండా కార్డు వస్తే దానిని యాక్టివేట్ చేయకూడదు. ఉదాహరణకు ఓటీపీ నంబర్ల వంటి వాటిని చెప్పకూడదు. కార్డును యాక్టివేట్ చేయడానికి ఖాతాదారుడి నుంచి అనుమతి రాకపోతే సదరు బ్యాంకు లేదా సంస్థ ఆ ఖాతాదారుడికి ఎటువంటి ఖర్చు లేకుండా ధ్రువీకరణ కోరిన తేదీ నుంచి ఏడు పని దినాల్లో కార్డు ఖాతాను మూసివేయాలి.

# 'ఐటీ' ఆదాయ అంచనాలపైట్కె బెంగ




హైదరాబాద్: కొత్త ప్రాజెక్టులు తగ్గడం.. ముఖ్యంగా వేర్వేరు రంగాల సంస్థలు ఐటీ ఆధారిత సేవల వ్యయాలపై కోత విధిస్తున్న నేపథ్యంలో, భారతీయ ఐటీ దిగ్గజాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఐటీ సంస్థల ఆదాయాలు, లాభాలు తగ్గుతాయని పలు రేటింగ్ సంస్థలు అంచనాలు విడుదల చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అమెరికా కేంద్రంగా పలు దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న ఐటీ దిగ్గజ సంస్థ యాక్సెంచర్ తన భవిష్యత్తు ఆదాయంలో వృద్ధి 1–3 శాతానికే పరిమితం కావొచ్చని పేర్కొంది. గతంలో ఈ అంచనా 2–5 శాతంగా ఉంది. ఈ నేపథ్యంలోనే భారతీయ ఐటీ సంస్థల ఆదాయ వృద్ధిపైనా అనుమానాలు రేకెత్తాయి. ఫలితంగానే దేశీయ ఐటీ దిగ్గజాలైన ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, విప్రో తదితర కంపెనీల షేర్లు శుక్రవారం 1–3% నష్టపోయాయి. నిఫ్టీ ఐటీ సూచీ 3% తగ్గింది. టెక్నాలజీ సూచీలు నెల వ్యవధిలో 9% క్షీణించడం గమనార్హం. అంతర్జాతీయంగానూ పలు ఐటీ సంస్థలు 2024 ఆదాయ అంచనాలపై ఇంకా స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

# ఆకాశ ఎయిర్‌కు పైలట్ల కొరత లేదు!




**ముంబయి :** ఆకాశ ఎయిర్ వద్ద తగినంత సంఖ్యలో పైలట్లు ఉన్నందున, తమ విమాన సర్వీసులు రద్దు అవుతాయేమోనని ప్రయాణికులు ఆందోళన చెందనవసరం లేదని ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వినయ్ దుబే శుక్రవారం వెల్లడించారు. 'మాకు తగినంత మంది పైలట్లు ఉన్నారు. గతంలో పైలట్ల సంఖ్యను 700గా మేం చెప్పాం. ప్రస్తుతానికే కాదు.. భవిష్యత్ విస్తరణ అవసరాల కోసం కూడా తగినంత సంఖ్యలో పైలట్లను కలిగి ఉండాలనే ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. అందువల్ల సర్వీసులు రద్దవుతాయని ప్రయాణికులు ఆందోళన చెందొద్ద'ని దుబే తెలిపారు. ప్రస్తుతం తమ కంపెనీలో మొత్తం సిబ్బంది 3700 వరకు ఉంటారని పేర్కొన్నారు. 'మేం విమాన సర్వీసులను తగ్గించలేదు. ఆకాశ ఎయిర్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సర్వీసులు నడుస్తున్నాయి. పరిశ్రమలోనే అత్యంత తక్కువ సంఖ్యలో సర్వీసుల రద్దు ఘనత మాకే ఉంది. ముమ్ముందూ దీనిని కొనసాగిస్తామ'ని దుబే స్పష్టం చేశారు. ఆకాశ ఎయిర్ రెండున్నరేళ్లుగా ఎక్కువగా ఆధారపడుతున్న బోయింగ్ 737 విమానాలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతున్న విషయంపై స్పందిస్తూ.. అది ఓ గొప్ప విమానమని తెలిపారు. 'ప్రపంచంలో అత్యంత ఆధునిక, ఇంధన సామర్థ్యమున్న విమానాల్లో ఈ మోడల్ ఒకటి. ఈ విమానాలపై మేం అత్యంత సంతృప్తిగానే ఉన్నామ'ని దుబే వివరించారు. స్పైస్‌జెట్ విమాన సర్వీసుల కుదింపు: దేశంలో విమాన ప్రయాణికుల రద్దీ రికార్డు స్థాయిలో పెరగొచ్చన్న అంచనాల మధ్య పలు విమానయాన సంస్థలు కార్యకలాపాలను విస్తరించే యత్నాల్లో ఉండగా.. స్పైస్‌జెట్ మాత్రం విమాన సర్వీసులను తగ్గించుకోవాలని నిర్ణయించింది. 2024 మార్చి 31 నుంచి అక్టోబరు 26 వరకు ప్రకటించిన వేసవి సీజను సర్వీసుల ప్రణాళిక సంఖ్యలో, 26% తగ్గిస్తామనే సంకేతాలు ఇచ్చింది. స్పైస్‌జెట్ వద్ద మొత్తం 63 విమానాలు ఉండగా.. 39 మాత్రమే నడుపుతోంది. సెప్టెంబరులో ఈ సంఖ్య 32గానే ఉంది. అందువల్లే వారం ప్రణాళికలో 26% విమాన సర్వీసుల్లో కోత విధించాలని ప్రతిపాదించినట్లు సమాచారం.

# భారత స్టార్టప్‌లకు నిధుల కటకట...!



**న్యూఢిల్లీ :** భారత్‌లోని స్టార్టప్ సంస్థలు గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నాయి. నిధుల సమీకరణలో తీవ్ర సవాళ్లను చవి చూస్తున్నాయి. గతేడాది నిధుల లభ్యత భారీగా తగ్గిపోయింది. భారత ఆర్థిక వ్యవస్థ దూసుకుపోతోందని మోడి ప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి.. స్టార్టప్‌ల్లో పెట్టుబడులకు భిన్నమైన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఒకప్పుడు భారతీయ టెక్ వెంచర్లలో వందల కోట్ల డాలర్ల పెట్టుబడికి ఆసక్తిని చూపిన ఇన్వెస్టర్లు ఇటీవల నెమ్మదించారు. దీంతో నిధుల కొరతతో ఔత్సాహిక వ్యాపారవేత్తలు నిరాశ చెందుతున్నారు. ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక పేటియంలో చోటు చేసుకున్న పరిణామాలు ఇన్వెస్టర్లల్లో మరింత విశ్వాసాన్ని దెబ్బతీశాయి. వందలాది ప్రారంభ దశ స్టార్టప్‌ల్లో పెట్టుబడులు పెట్టిన ఇండియాస్ బ్లూమ్ వెంచర్స్ మేనేజింగ్ పార్టనర్ కార్తిక్ రెడ్డి గతేడాదిలో 12 డీల్‌లతో పోలిస్తే ఈ ఏడాది దాదాపు ఎనిమిది మాత్రమే కొత్త ఒప్పందాలు చేయాలని తమ సంస్థ యోచిస్తోందని చెప్పారు. ఇది మరిన్ని కంపెనీలలో నిధులను విస్తరించడానికి బదులుగా తనకు నమ్మకంగా ఉన్న సంస్థలలో పెద్ద మొత్తాలను పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నామన్నారు. ప్రస్తుతం పోర్టుపోలియో లాభాలను పరిశీలించినప్పుడు మరింత ఇన్వెస్ట్ చేయడానికి ఉత్సాహంగా లేమని రాయిటర్స్‌తో ఆయన అన్నారు. రాయిటర్స్ ఇటీవల విదేశీ, స్వదేశీ పెట్టుబడి సంస్థల్లోని ఆరుగురు ఎగ్జిక్యూటివ్‌లు, ఇద్దరు సిఇఒలను ఇంటర్వ్యూ చేసింది. ప్రస్తుత ఏడాది జనవరి, ఫిబ్రవరిలో భారత స్టార్టప్‌లు 900 మిలియన్ డాలర్ల (రూ. 7500 కోట్లు)ను సేకరించాయి. ఇది ఆరేళ్ల కనిష్ట స్థాయి కావడం గమనార్హం. కాగా 2023లో 8 బిలియన్ల (రూ. 64వేల కోట్లు) నిధులు సమీకరించాయని వెంచర్ ఇంటెలిజెన్స్ డేటా చూపిస్తోంది. ఇది 2021లో సేకరించిన రికార్డు 36 బిలియన్లు లేదా 2022లో 24 బిలియన్లకు చాలా దూరంగా ఉంది. గతేడాది భారతీయ స్టార్టప్‌లకు మూడింట రెండు వంతుల నిధులు తగ్గాయని సిబిఇన్‌సైట్స్ డేటా వెల్లడించింది. అమెరికాలోని స్టార్టప్‌లకు 36 శాతం తగ్గుదలతో పోల్చితే భారత స్టార్టప్‌లు చాలా వెనుకబడి పోయాయి. ప్రస్తుత వాతావరణంలో స్టార్టప్‌ల్లో పెట్టుబడుల ద్వారా పెద్ద రాబడిని పొందగలమని తాను భావించడం లేదని కార్తిక్ రెడ్డి పేర్కొన్నారు.

# పసిడి.. పరుగో పరుగు




**న్యూఢిల్లీ :** బంగారం ధర ఒక్కసారిగా ఎగిసింది. దీంతో గురువారం మరో సరికొత్త స్థాయికి చేరింది. ఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ పసిడి ధర రూ. 1,130 ఎగబాకి ఆల్‌టైమ్ హైని తాకింది. మునుపెన్నడూ లేనివిధంగా రూ. 67, 450 వద్ద నిలిచింది. హైదరాబాద్‌లోనూ రూ. 1,090 పుంజుకొని రూ. 67,420 వద్ద ఉన్నది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్.. ఈ ఏడాది వడ్డీరేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు బలంగా ఉన్న నేపథ్యంలో మదుపరులు తమ పెట్టుబడులను గోల్డ్‌వైపునకు మళ్లిస్తున్నారు. ఏవైనా ఒడుదొడుకుల నుంచి తమ ఇన్వెస్ట్‌మెంట్లకు రక్షణగా గోల్డ్‌నే ఎంచుకుంటున్నారు మరి. ఈ క్రమంలోనే రేట్లు ఇంతలా పెరిగాయని మార్కెట్ నిపుణులు తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లలోనూ పుత్తడి ధరలు పరుగులు పెడుతున్నాయి. ఔన్సు 2,202 డాలర్లు పలికింది. ఒక్కరోజే ఏకంగా 48 డాలర్లు పెరగడం విశేషం. అయితే భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలకుతోడు ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకులు గోల్డ్‌ను విపరీతంగా కొనేస్తుండటం కూడా ఇందుకు కారణమని ట్రేడర్లు అభిప్రాయపడుతున్నారు. భారతీయ మార్కెట్‌పైనా ఈ ప్రభావం ఉన్నదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రిసెర్చ్ అనలిస్ట్ దిలీప్ పామర్ అన్నారు. బంగారంతోపాటు వెండి రేట్లూ ఎగిశాయి. ఢిల్లీలో కిలో వెండి ధర రూ. 1,100 పెరిగి రూ. 77,750ని చేరింది. హైదరాబాద్‌లోనైతే ఇది రూ. 78,500లుగా నమోదైంది. బుధవారంతో పోల్చితే రూ. 1,500 ఎగిసింది.

# డ్రిప్ ఇరిగేషన్ చేస్తే ప్రోత్సాహం..

## ఏకంగా 90శాతం సబ్సిడీ ఇస్తున్న ప్రభుత్వం

డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిని రైతులు పాటించేందుకు సబ్సిడీపై పరికరాలు అందజేస్తున్నారు. ఈ నూతనం విధానాన్ని రైతులు పాటించడం కోసం ఈ చర్యలు తీసుకున్నారు. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను 90 శాతం సబ్సిడీపై ఇస్తున్నారు. రైతులు తమ సమీపంలోని వ్యవసాయాధికారులను సంప్రదించాలి. మనది వ్యవసాయాధారిత దేశం. చాలా మంది పంటలు పండించి జీవనం సాగిస్తారు. దేశంలోని ప్రజలందరికీ తిండి లభించాలంటే సాగు చాలా కీలకం. దాని జాగ్రత్తగా కాపాడుకున్నప్పుడే దేశం ముందుకు సాగుతుంది. పంటలు పండించడానికి భూమితో పాటు నీరు చాలా కీలకం. నీరు పూర్తిస్థాయిలో ఉన్నప్పుడే పంటలు బాగా పండుతాయి. సాధారణంగా కాలువల ద్వారా వచ్చిన నీటిని పొలాలకు పెద్ద ఎత్తున మళ్లిస్తారు. కాలువలు లేనిచోట్ల బోర్ల ద్వారా భూగర్భ జలాలను పైకి లాగి పొలాలకు నీరు పెడతారు. అయితే ఈ విధానాల్లో పొలానికి అవసరానికి మంచి నీరు అందిస్తున్నారు.



మామూలుగా మొక్కల వేర్లకు నీరు అందితే సరిపోతుంది. కానీ ఇక్కడ మొక్కలతో పాటు పొలమంతా నీరు చేరుతుంది. దీనివల్ల పెట్టుబడి పెరగడంతో పాటు నీటి వనరులు తరిగి పోతున్నాయి. ముఖ్యంగా కూరగాయలు, ఉద్యాన పంటల సాగులో నీరు వృథా అవుతున్నట్టు వ్యవసాయ శాస్త్రవేత్తలు గమనించారు. ఈ తోటల సాగులో మొక్క వేరుకు నీరు అందిస్తే సరిపోతుందని గుర్తించారు. ప్రభుత్వం కూడా ఈ విషయంపై స్పందించింది.

# రెండు నెలల్లో మార్కెట్‌లోకి తొలి సీఎన్‌జీ బైక్




**పుణె :** దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం బజాజ్ ఆటో ద్విచక్ర వాహన విభాగంలో నూతన అంకానికి తెర లేపనుంది. ఈ ఏడాది జూన్ నాటికి తొలి సీఎన్‌జీ బైక్‌ను మార్కెట్‌లోకి విడుదల చేయనున్నట్లు కంపెనీ ఎండీ రాజీవ్ బజాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. "పర్యావరణ పరిరక్షణతోపాటు అధిక మైలేజ్ కోరుకునే బైకర్లను దృష్టిలో ఉంచుకుని బజాజ్ ఆటో సీఎన్‌జీ బైక్‌ను అభివృద్ధి చేస్తోంది. ఈ బైక్‌ను మరో కొత్త బ్రాండ్ పేరుతో విడుదల చేయాలని కంపెనీ భావిస్తోంది. తయారీ వ్యయం ఎక్కువకావడం వల్ల పెట్రోల్ బైక్‌లతో పోలిస్తే ధర ఎక్కువగా ఉంటుంది. ఇందులో పెట్రోల్, సీఎన్‌జీ రెండు ఆప్షన్లు ఉంటాయి. దీని కోసం బైక్ ట్యాంక్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేస్తున్నాం. 20 ఏళ్ల క్రితం విడుదలైన పల్సర్ బైక్‌కు వినియోగదారుల నుంచి విశేష ఆదరణ లభించింది. త్వరలో ఇది 2 మిలియన్ యూనిట్ల మైలు రాయిని చేరుకోనుంది.

# ఇక బిజెపికే టిటిడిపి మద్దతు!!

- లోక్‌సభ ఎన్నికలకు పోటీకి టి టిడిపి దూరమే??
- ఏపిలో పార్టీ గెలిస్తే తెలంగాణలోనూ అలానే బిజెపితో ముందుకు
- ఏపి ఎన్నికల కోసం పయనమవుతున్న టి టిడిపి నేతలు

హైదరాబాద్ : ప్రస్తుతానికి తెలంగాణ టిడిపికి అధ్యక్షుడు లేని పరిస్థితి ఒక వైపు ఉండగా, మరో వైపు ఏపిలో అసెంబ్లీకి, లోక్ సభకు ఎన్నికలు వచ్చాయి. ఈ క్రమంలో ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రస్తుతం ఏపి ఎన్నికలకే పరిమితమవుతున్నారు. తెలంగాణలో పార్టీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఇటీవలే బిఆర్ఎస్‌లో చేరిపోగా ఆ స్థానాన్ని అధినేత చంద్రబాబు ఇప్పటి వరకు భర్తీ చేయలేక పోయారు. ఏపి రాజకీయాలు కీలకం కావడంతో ఆయన ముందు ఏపిలో గెలిసి వద్దామని, ఆ తర్వాత వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు తెలంగాణపై దృష్టి సారిస్తామని చెప్పినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

అటు ఏపిలో టిడిపితో బిజెపి జట్టు కట్టడంతో ఆ బంధం ఇక్కడ తెలంగాణలోనూ కొనసాగిస్తారా? లేక ఆ ఎన్నికల తర్వాత తీసుకునే నిర్ణయం మేరకు ముందుకు వెళ్లాలా? అన్న దానిపై పార్టీ క్యాడర్‌కు ఇంకా క్లారిటీ రాలేదని అంటున్నారు. ఇదిలా ఉంటే ఎలాగూ ఏపిలో బిజెపితో పొత్తు కుదుర్చుకున్న నేపథ్యంలో తెలంగాణలోనూ లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి పార్టీకే ఓట్లు వేయించేందుకు ముందుకు వెళ్లడమే తమ ముందున్న కర్తవ్యమని టి టిడిపి నేతలు చెబుతున్నారు.

**ఏపి ఎన్నికల నేపథ్యంలోనే...**

కాగా ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు ఏక కాలంలోనే లోక్‌సభ, అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతుండడంతో ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు కేవలం ఏపిపైనే దృష్టి సారిస్తున్నారు. జనసేన, బిజెపితో పొత్తుపెట్టుకుని ఏపిలో ఎలాగైనా అధికారంలోకి వచ్చే దిశగా పావులు కదుపుతున్న ఆ పార్టీ అధిష్టానం తెలంగాణ లోక్ సభ ఎన్నికల్లో పోటీపై ముందుకు వెళ్లలేక పోతోంది. ఈ క్రమంలో బిజెపితో పొత్తు తమకు కలిసి వస్తే భవిష్యత్తులో తెలంగాణలోనూ బిజెపితో కలిసి ముందుకు సాగుతామని మాత్రమే ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ముఖ్యంగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తెలంగాణ తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి బిఆర్ఎస్ పార్టీలో చేరి ఆరు మాసాలు గడిచినా ఇప్పటి వరకు ఆ స్థానం ఖాళీగానే ఉంది. మొన్న అసెంబ్లీ ఎన్నికలు వచ్చినా.. నేడు లోక్‌సభ ఎన్నికలు వచ్చినా టి టిడిపి మాత్రం పోటీ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేక సతమతమవుతోంది. ఏపిలో తమ అధినేత చంద్రబాబు నాయుడు గెలిచాకే తెలంగాణపై దృష్టి సారించే అవకాశాలు ఉంటాయని..అప్పటిదాకా వేచి చూస్తామని కొందరు ఆ పార్టీ నేతలు చెబుతుండడం గమనార్హం.

**ఏపి ఎన్నికల కోసం టిడిపి నేతలు**

కాగా ఏపి ఎన్నికల ప్రచారం కోసం పలువురు తెలంగాణ టిడిపి నేతలు ఏపికి పయనమవుతున్నారు. ఇటీవల పలు జిల్లాలు పర్యటించిన అధినేత చంద్రబాబుకు మద్దతు తెలిపి ఆయన ప్రచార కార్యాక్రమాల్లో పాల్గొని వచ్చారు. తాజాగా మరో సారి ఈ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనూ పాల్గొనుటకు వెళ్లున్నారు. టిడిపి సీనియర్ నేతలు బక్కని నర్సింహులు, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు భవనం షకీలా రెడ్డి, సీనియర్ నేత నన్నూరి నర్సిరెడ్డి, మాజీ ఎంఎల్ఏ కాట్రగడ్డ ప్రసూనతో పాటు మరింత మంది సీనియర్లు ఏపి ప్రచారంలో పాల్గొని వస్తున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు, ఆయన సతీమణి నారా భువనేశ్వరీ, పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌లను కలిసి ప్రచారంలో పాల్గొంటున్నారు. రాబోయే ఎన్నికల్లో గెలుపు ఎన్‌డియేదే అని చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేస్తుండడంతో తెలంగాణలోనూ బిజెపితో కలిసి ముందుకు వెళ్లే అవకాశాలు ఉంటాయని ఆ పార్టీ నేతలే చెబుతుండడం విశేషం.

# ఎన్నికల వేళ... పాతబస్తీలో ఇఫ్తార్ రాజకీయాలు...!

- ఇఫ్తార్ పార్టీలతో జనంలోకి మజ్లిస్ నేతలు
- ఓటర్లను అకట్టుకునేందుకు పడరాని పాట్లు



హైదరాబాద్ : ముస్లింల పవిత్ర మాసం రంజాన్ అంటే మనకు గుర్తుకు వచ్చేది ఇఫ్తార్ విందులు... అది ఎన్నికల సమయంలో అయితే ఇక చెప్పనక్కర లేదు. ఓట్ల కోసం తాపత్రపడే రాజకీయ నేతలు ఇఫ్తార్ పార్టీల పేరుతో ఓటర్లను ఆకట్టుకునేందుకు పోటీ పడడం సహజం. పార్లమెంటు ఎన్నికల వేళ ఇప్పుడు హైదరాబాద్ పార్లామెంటు నియోజకవర్గ పరిధిలో అదే జరుగుతోంది. ఇఫ్తార్ విందు రాజకీయాలు ఊపందుకున్నాయి. గత కొంత కాలంగా హైదరాబాద్ పార్లమెంటు పరిధిలో ఓటింగ్ సరళి నెమ్మదిస్తూ వస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికలను చూస్తే అతి తక్కువ పోలింగ్ జరిగింది హైదరాబాద్‌లోనే. ఎంఐఎం సామ్రాజ్యంగా చెప్పుకునే హైదరాబాద్ పార్లమెంటు పరిధిలో మెజారిటీ వర్గం ముస్లిం మైనారిటీలు. అయినప్పటికీ ఓటింగ్ సరళి పడిపోతూ వస్తోంది. ముఖ్యంగా చదువుకు యువత ఓటింగ్‌కు ఆసక్తి కనబరుచడం లేదని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. 40 శాతం లోపే పోలింగ్ జరగడం ఆందోళన కల్గిస్తోంది. ఎంఐఎంకు పోలయ్యే ఓట్ల శాతం కూడా తగ్గుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సారి పార్లమెంటు ఎన్నికలను ఎంఐఎం తేలిగ్గా తీసుకోవడం లేదు. ప్రధాన ప్రత్యర్థి బిజెపి ఈ సారి మహిళను రంగంలోకి దింపడం, బిజెపి జాతీయ నాయకత్వం హైదరాబాద్‌పై గురి పెట్టడంతో ఎంఐఎం శ్రేణులు అప్రమత్తమయ్యాయి. దేశవ్యాప్తంగా పోటీ చేస్తామన్న ఎంఐఎంను హైదరాబాద్‌కే కట్టడి చేసేందుకు కమలనాథులు పాచికలు పారుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే హైదరాబాద్‌తో పాటు మరో రెండు చోట్ల ఎంఐఎం అభ్యర్థులను ప్రకటించింది. మరిన్ని రాష్ట్రాల్లో పోటీ చేసేందుకు ఆ పార్టీ ప్రయత్నాలు చేస్తోంది.

అయితే ప్రస్తుత పరిస్థితులకనుగుణంగా అసదుద్దీన్ ఓవైసి ఇతర రాష్ట్రాల కంటే హైదరాబాద్‌పైనే ఎక్కువ దృష్టి సారించినట్లు కనబడుతోంది. ఆయన ప్రతిరోజు హైదరాబాద్‌లోనే పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. రంజాన్ ఉపవాస దీక్షలు కొనసాగుతుండడంతో ఆ పార్టీ నేతలు ప్రతిరోజు ఇఫ్తార్ పార్టీలతో ఓటర్లను ఆకట్టుకునే యత్నాలు చేస్తున్నారు. ఎంఐఎం అగ్రనేతలు అసదుద్దీన్ ఓవైసి, అక్బరుద్దీన్ ఓవైసితో పాటు ఆ పార్టీ ఎంఎల్ఎలు ఇఫ్తార్ విందుల్లో పాల్తొంటూ ఓటర్లను దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసి ప్రతి రోజూ ఇఫ్తార్ విందుల్లో పాల్గొంటున్నారు. అసదుద్దీన్ సోదరుడు, ఎంఎల్ఏ అక్బరుద్దీన్ ఓవైసి ఏకంగా చారిత్రాత్మక మక్కా మసీదులో ప్రతి రోజు 1500 మందికి ఇఫ్తార్ విందు ఇస్తున్నారు. రంజాన్ ఉపవాసాలు కొనసాగినన్ని రోజులు ఈ విందు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అయితే సాలార్ ఎ మిల్లత్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, హబీబ్ ఎ మిల్లత్ పొలిటికల్ రిసెర్చ్ సెంటర్ తరఫున ఆయన ఈ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఏది ఏమైనా ఇఫ్తార్ రాజకీయాలతో మజ్లిస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతుందని రాజకీయ వర్గాలు భా3విస్తున్నాయి.

## హోలీ వేడుకల్లో విషాదం...

# నదిలో మునిగి నలుగురు మృతి



ఆసిఫాబాద్ ప్రతినిధి (కౌటాల): హోలీ పండుగ వేళ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటు సంబరాలు జరుపుకున్నారు. ఈ క్రమంలో స్నానానికి అని వార్దానదిలో మునిగి నలుగురు మృతి చెందిన సంఘటన ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలో చోటు చేసుకుంది. నదిమాబాద్ గ్రామానికి చెందిన ఆరుగురు స్నేహితులు సోమవారం ఉదయం హోళి పండుగ సందర్భంగా ఒకరిపై ఒకరు రంగు చల్లుకుంటు సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మధ్నాహ్నం స్నానం చేయడానికని వార్దా నదిలోకి వెళ్లి స్నానం చేశారు. ఇందులో ఇద్దరు స్నేహితులు స్నానం చేసి వార్దా నది ఒడ్డుపైకి వచ్చారు. మిగితా నలుగురు స్నేహితులు నదిలో స్నానం చేస్తూ లోతుగా ఉన్న ప్రదేశంలోకి వెళ్లారు.

దీంతో నది ఒడ్డున ఉన్న ఇద్దరు స్నేహితులు వెంటనే సమీపంలోని గ్రామానికి వెళ్లి గ్రామస్తులకు తెలియజేయడంతో వారు నది వద్దకు వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. వెంటనే స్థానిక పోలీసులు గజ ఈతగాళ్లను తెప్పించి నదిలో గాలిస్తుండగా అల్లం సాయి (22), ఉప్పల సంతోష్ (24), ప్రవీణ్ (24), కమలాకర్ (24) అనే నలుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. వెంటనే మృతదేహాలను నది ఒడ్డుపైకి తీసుకువచ్చారు. ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో ఆ గ్రామంలో విషాదఛాయాలు అలుముకున్నాయి. వెంటనే జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్, డిఎస్‌పి కరుణాకర్, సంఘటన స్థలానికి చేరుకోని సంఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సాదిక్‌పాషా తెలిపారు.

# పుస్తెల తాడుతో పవిత్ర బంధాన్ని అతం చేసిన భార్య




హైదరాబాద్: జీవితాంతం తోడునీడగా ఉండాల్సిన భార్యాభర్తలు వివాహేతర సంబంధాలతో అయినవారినే అడ్డు తొలగించుకుంటున్నారు. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని కట్టుకున్న భర్తను అంతమొందించింది ఓ భార్య. చివరికి కిరాయి గూండాలకు భర్త కట్టిన పుస్తెలతాడును సుపారిగా ఇచ్చి భర్తను హతమార్చింది. నల్గొండ జిల్లా కట్టంగూరు మండలం కలిమెరకు చెందిన వనం ఈశ్వర్(35)కు సూర్యాపేట మండలం టేకుమట్లకు చెందిన నవ్యతో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక పాప (4), బాబు(2) ఉన్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పెద్ద మనుషుల మధ్య పంచాయితీ కూడా జరిగింది. ఈ క్రమంలో పక్కనే ఉన్న వైన్ షాపులో పని చేసే కట్టంగూర్ మండలం అంబటివాగుకు చెందిన సతీశ్?తో నవ్యకు పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ వివాహేతర సంబంధం గురించి తెలిసిన భర్త ఈశ్వర్ భార్య నవ్యతో గొడవ పడుతుండేవాడు. ఇలాంటి పనులు మానుకోవాలంటూ కొడుతుండేవాడు. దీంతో తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను అడ్డు తొలగించుకోవాలని భార్య నవ్య, ప్రియుడు సతీష్ భావించారు.

**సుపారి కోసం పుస్తెలతాడు..**

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం ఎర్రగుంటకు చెందిన నక్క వీరాస్వామి లారీ డ్రైవర్?గా పనిచేస్తున్నాడు. సతీష్?కు వీరస్వామి దూరపు బంధువు. నవ్యతో తనకు ఉన్న వివాహేత సంబంధానికి అడ్డుగా ఉన్న ఈశ్వర్?ను హత్య చేయాలని కోరాడు. తనకు తెలిసిన వారితో కలిసి ఈశ్వర్?ను హత్య చేసేందుకు వీరస్వామి రెండు లక్షల రూపాయలకు ఒప్పందం చేసుకున్నాడు. సుపారి విషయాన్ని నవ్యకు చెప్పడంతో తన మెడలో భర్త కట్టిన రెండు తులాల బంగారు పుస్తెలతాడును తీసి సతీష్?కు ఇచ్చింది.

మిర్యాలగూడ మండలం వెంకటాద్రి పాలెంకు చెందిన ధనవత్ హనుమ నాయక్, త్రిపురారం మండలం బడాయిగడ్డ తండాకు చెందిన ధనవత్ సాయిలను వీరస్వామి సంప్రదించి ఈశ్వర్?ను హత్య చేసేందుకు రూ.40 వేలు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అందరూ కలిసి ఈశ్వర్?ను హత్య చేసేందుకు పథకం వేశారు. ఈనెల 16న ఈశ్వర్, భార్యా పిల్లలతో కలిసి కట్టంగూర్ నుండి టేకుమట్లకు బైక్?పై వెళ్తున్నాడు. నకిరేకల్ దాటిన తర్వాత ఈశ్వర్ బైక్ చెడిపోవడంతో భార్యాపిల్లలను ఆటో ఎక్కించి టేకుమట్లకు పంపించాడు. అప్పటికే ఈశ్వర్?ను వీరస్వామి హనుమాన్ నాయక్, సాయిలు వెంబడిస్తున్నారు. బైక్ రిపేర్?లో సహాయం చేసే సాకుతో వీరస్వామి అక్కడికి వెళ్లాడు. మాటలు కలిపి పరిచయం చేసుకొని ఈశ్వర్ ఫోన్ నెంబరు తీసుకున్నాడు. తర్వాత ఇద్దరూ కలిసి నకిరేకల్?లో మద్యం తాగారు. పథకంలో భాగంగా ఈ నెల 17న వీరస్వామి సూర్యాపేటలో కారు అద్దెకు తీసుకుని కట్టంగూరు వచ్చాడు. ఈశ్వర్?ను నల్గొండకు వెళ్దామని నమ్మించి కారులో ఎక్కించుకున్నాడు. అప్పటికే నల్లగొండ బస్టాండ్?లో వెయిట్ చేసున్న హనుమ నాయక్, సాయిలను కూడా కారులో ఎక్కించుకుని కట్టంగూర్ వైపు వెళ్లారు. మార్గ మధ్యలో దండంపల్లి గ్రామ శివారులో.. కారు వెనుక సీటులో కూర్చున్న హనుమాన్ నాయక్, సాయిలు కారు ముందు సీటులో కూర్చున్న ఈశ్వర్ మెడకు తాడు బిగించి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశారు. మృతదేహాన్ని తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లి వద్ద ఓ వ్యవసాయ బావిలో పడేశారు. హత్య అనంతరం వీరస్వామి, హనుమాన్ నాయక్, సాయిలకు రెండు తులాల బంగారు పుస్తెలతాడు, రూ. 95 వేల నగదును సతీష్?కు ఇచ్చాడు. బావిలో గుర్తు తెలియని మృతదేహం లభించడం, ఈశ్వర్ బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న తిప్పర్తి పోలీసులు విచారణ చేపట్టారు. పోలీసుల దర్యాప్తులో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను తొలగించుకునేందుకు భార్య నవ్య భర్త కట్టిన పుస్తెలతాడునే సుపారీ ఇచ్చి హత్య చేయించిందని పోలీసులు చెబుతున్నారు. భార్య నవ్య ప్రియుడు సతీష్, హనుమానాయక్, సాయిలను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి కారు, రెండు తులాల బంగారు పుస్తెలతాడు, రెండు బైక్ లు, ఐదు ఫోన్లు, రూ.20వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు నల్లగొండ డిఎస్పి కె శివరాం రెడ్డి చెప్పారు.

# జనసేనలో సగం సీట్లు కాపులకే



హైదరాబాద్: సార్వత్రిక ఎన్నికల్లో ఏపి నుంచి తెలుగుదేశం బిజేపిలతో జట్టు కట్టి పోటీ చేస్తున్న జనసేన పార్టీ ఈ ఎన్నికల్లో 21అసెంబ్లీ స్థానాలనుంచి అభ్యర్థులను పోటీకి దింపుతోంది. ఇప్పటికే 18స్థానాల్లో పార్టీ అభ్యర్థులును జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. అందులో అత్యధిక స్థానాలను తన సామాజిక వర్గం వారికే కేటాయించారు. రెడ్లకు ఒక్కసీటు కూడా కేటాయించలేదు. పార్టీ అధినేత పవన్ రెడ్లను ఈ ఎన్నికల్లో పూర్తిగా దూరం పెట్టేశారు. మొత్తం స్థానాల్లో మహిళకు ఒక స్థానం కేటాయించారు. షెడ్యుల్ తెగలు , షెడ్యూల్ కులాల వారికి రిజర్వ్ చేసిన నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలను మినహాయిస్తే మిగిలిన 14 నియోజకవర్గాల్లో పది నియోజకవర్గాలకు కాపు సామాజిక వర్గం అభ్యర్థులనే ఎంపిక చేశారు.

ఒక సీటును క్షత్రిక సామాజిక వర్గానికి కేటాయించారు. మిగిలిన మూడు స్థానాలు బిసిలకు కేటాయించారు. జనసేన పార్టీ ప్రకటించిన 14జనరల్ సీట్లలో కాపుసామాజిక వర్గం వారికి కేటాయించిన 10 స్థానాల్లో శెట్టిబలిజ కులాన్ని పూర్తిగా పక్కన పెట్టి కాపు సామాజిక వర్గానికే పెద్ద పీట వేశారు. పార్టీ అధినేత పవన్ ప్రకటించిన స్థానాల్లో

పిఠాపురం : పవన్ కళ్యాణ్ (కాపు),
కాకినాడ రూరల్ : పంతం నానాజీ (కాపు),
రాజానగరం : బత్తుల బలరామ కృష్ణ (కాపు),
తెనాలి : నాదెండ్ల మనోహర్ (కమ్మ),
నిడదవోలు : కందుల దుర్గేష్ (కాపు),
పెందుర్తి : పంచకర్ల రమేష్ (కాపు),
ఎలమంచిలి : విజయ్ కుమార్ (కాపు),
భీమవరం : పులవర్తి ఆంజనేయులు (కాపు),
ఉంగుటూరు : ధర్మరాజు (క్షత్రియ)
తిరుపతి : ఆరని శ్రీనివాసులు (బలిజ కాపు),
తాడేపల్లిగూడెం : బోలిసెట్టి శ్రీనివాస్ (కాపు), అభ్యర్థులను ప్రకటించారు.

తీసుకున్న 21 సీట్లలో ఇప్పటివరకు 18 సీట్లు ప్రకటించిన పవన్ కళ్యాణ్ మరో మూడు అంసెబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సివుంది.

## మండి పార్లమెంట్ బరిలో బాలీవుడ్ క్వీన్..

# కంగనాపై పోటీకి కాంగ్రెస్ బలమైన అభ్యర్థి!




మండి (హిమాచల్‌ప్రదేశ్) : హిమాచల్‌ప్రదేశ్ లోని మండి నుంచి బీజేపీ తరపున లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగిన బాలీవుడ్ నటి కంగనా రనౌత్ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. బీజేపీ కార్యకర్తలతో కలిసి హోలీ వేడుకల్లకు హాజరయ్యారు. తనకు ఎంపీ టిక్కెట్ కేటాయించడంపై బీజేపీ హైకమాండ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పెద్దలు ఏ బాధ్యత అప్పగించినా నెరవేరుస్తానని అన్నారు కంగనా. ప్రధాని మోదీకి భారత్ లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందన్నారు. మోదీ నాయకత్వంలో తాను పార్టీకి సేవలు చేస్తానని తెలిపారు. "మండి చాలా పెద్ద నియోజకవర్గం. ప్రతి చోట ప్రచారం చేస్తాం. ప్రతి గ్రామానికి వెళ్తాం. ప్రజల్లో కొత్త ఉత్సాహం నింపేందుకు ప్రయత్నిస్తాం. బీజేపీ లక్ష్యాన్ని ప్రజలకు వివరిస్తాం. నేను సామాన్య కార్యకర్తగా పనిచేస్తా.. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా నెరవేరుస్తాం. నాకు సొంత ఎజెండా లేదు. పార్టీ విధానమే నా విధానం" అని ఆమె అన్నారు.

అయితే మండిలో కంగనా రనౌత్‌ను ఎలాగైనా ఓడించాలన్న పట్టుదలతో కాంగ్రెస్ ఉంది. మండిలో కంగనాపై పోటీకి సై అన్నారు పార్టీ చీఫ్ ప్రతిభాసింగ్. హైకమాండ్ ఆదేశిస్తే మండి నుంచి పోటీ చేస్తానని ప్రకటించారు.

# ఉజ్జయిని మహంకాళి ఆలయంలో అపశ్రుతి..

## హారతి ఇచ్చేవేళ మంటలు.!

పవిత్ర హోలీ పండుగవేళ పరమేశ్వరుని ఆలయంలో అపశ్రుతి చోటుచేసుకుంది. మహాకాళేశ్వరునికి హారతి ఇచ్చే వేళ ఆలయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 13 మంది గాయపడ్డారు. ప్రమాద సమయంలో ఆలయంలో పెద్దసంఖ్యలో భక్తులు ఉన్నారు. వారంతా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలు అదుపుచేశారు. ఈ ఘటన మధ్యప్రదేశ్ ఉజ్జయిని మహాకాళేశ్వరుని ఆలయంలో చోటుచేసుకుంది. మధ్యప్రదేశ్ ఉజ్జయిని మహాకాళేశ్వరుని గర్భగుడిలో సోమవారం ఉదయం భస్మ హారతి సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో పూజారితో సహా 13 మందికి గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో వేలాది మంది భక్తులు ఆలయంలో ఉన్నారు. వారంతా ఆలయంలో జరిగే హోలీ వేడుకలను వీక్షించేందుకు వచ్చారు. హారతి సమర్పిస్తున్న పూజారి సంజీవ్ వెనుక నుంచి ఎవరో గులాల్ వెదజల్లడంతోనే ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. వెంటనే అక్కడున్న కొందరు భక్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికే గర్భగుడిలో హారతి సమర్పిస్తున్న సంజీవ్ పూజారి, వికాస్, మనోజ్, సేవాధారి ఆనంద్ కమల్ జోషితో సహా 13 మంది గాయపడ్డారు.



Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com